Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03


నెల్లూరు, 22.03.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 42 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com







- జగన్‌పై దాడికి బాబు మూడంచెల వ్యూహం
- బి-టీమ్‌గా జనసేన, సి-టీమ్‌గా కాంగ్రెస్
- దళితుల ఓట్ల కోసం రంగంలోకి బిఎస్పీ
- పచ్చమీడియా ముమ్మర విషప్రచారం

## చీలుద్దాం... గెలుద్దాం!

అధికారంలోకి వచ్చాక పారదర్శక పాలన అందించడం... ప్రజలు మెచ్చేలా పని చేయడం... ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో చూపించడం... మళ్లీ అయిదేళ్ళ తర్వాత మనం ప్రజల ముందుకు వెళితే మన పరిపాలన మెచ్చి ప్రజలు తిరిగి గెలిపించడం... దేశ రాజకీయాలలో ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా అనుసరించే విధానం ఇదే! జ్యోతిబసు, నవీన్ పట్నాయక్, రాజశేఖరరెడ్డి, శివరాజ్‌సింగ్ చౌహాన్, రమణసింగ్... ఇలా ఆయా రాష్ట్రాలను ముఖ్యమంత్రులుగా పరిపాలించిన వీళ్ళంతా కూడా తమ పాలనా కాలంలో మంచి పరిపాలన అందించి, దాని రెఫరెండంగానే మళ్లీ ఎన్నికలకు పోయినవాళ్ళే!

(మిగతా 11వ పేజీలో)



## సౌమ్యుడిని చంపిన కిరాతకులెవరు?

- వై.యస్.వివేకానందరెడ్డి దారుణహత్య

ఓ పక్క రాష్ట్రంలో ఎన్నికల యుద్ధ వాతావరణం... జగన్‌కు గెలుపో ఓటమో.. తేల్చుకోవాల్సిన సమయం. అభ్యర్థుల ఎంపికలో మల్లగుల్లాలు... అధికారపార్టీ వ్యూహాలకు ప్రతివ్యూహాలను పన్నే పనిలో క్షణం తీరిక లేని జీవితం... ఈ సమయంలోనే వై.యస్.కుటుంబంలో ఒక్క కుదుపు... పెద్దకుదుపు... వూహించని విషాదం.

(మిగతా 11వ పేజీలో)



## ఆదాల దెబ్బకు... 'దేశం'లో కల్లోలం

- వెన్నుపోటుకే గునపం పోటు
- జిల్లాలో మారిన సమీకరణలు

**2019 ఎలక్షన్స్... రాష్ట్ర రాజకీయాలలోనే సెన్సేషన్ ఎవరంటే ఆదాల ప్రభాకర్‌రెడ్డి. అవును నిజమే! ఆయన కొట్టిన దెబ్బకు రాజకీయ వ్యూహాల్లో యోధులైన చంద్రబాబునాయుడుకే దిమ్మ తిరిగి మైండ్ బ్లాకయ్యింది. రాజకీయాలలో చంద్రబాబు అందరికీ తల తిరిగేలా చేస్తుంటాడు. అలాంటి చంద్రబాబు అంచనాలకే అందని విధంగా షాకిచ్చాడు ఆదాల.**

తెలుగుదేశం నుండి నెల్లూరురూరల్ అభ్యర్థిగా ఖరారై వారంరోజులకు పైగా ప్రచారంలో తిరుగుతున్న ఆదాల ఆ పార్టీ అధిష్టానానికి కోలుకోలేని షాకిచ్చాడు. నెల్లూరు పార్లమెంట్ నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేయడాన్ని మేకపాటి రాజమోహన్‌రెడ్డి విరమించుకోవడంతో ఆదాలకు రాత్రికి రాత్రే ఆ సీటు ఆఫర్ తగిలింది. అంతే 14వతేదీ రాత్రికే రాజకీయం మారిపోయింది. 15వ తేదీ ఉదయం నెల్లూరు మినీబైపాస్‌లోని ఆదాల ఇంటిపై అప్పటిదాకా ఎగురుతున్న పసుపు జెండా ఎగిరి పోయింది. ఫ్యాన్ జెండా రెపరెపలాడింది. 16న హైదరాబాద్‌లో జగన్ సమక్షంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం,

(మిగతా 11వ పేజీలో)



# • ఎ(సె)లక్షన్ - 2019


# మోహరించిన సేనలు

ఎన్నికలంటే యుద్ధం... పార్టీ అధ్యక్షుడు సైన్యాధిపతి... అభ్యర్థులు సైనికులు. ఒకరితో ఒకరు తలపడాలి... యుద్ధం చేయాలి... గెలవాలి.! అలాంటి ఎన్నికల యుద్ధం చేయడం కోసమే నెల్లూరుజిల్లా నుండి ప్రధాన పార్టీలు తమ సైనికులను కదనరంగంలోకి దించాయి. ఏప్రిల్ 11వ తేదీ దాకా రోజూ యుద్ధమే... ఆ తర్వాత మే23 దాకా అందరికీ టెన్షనే...!

## వైయస్సార్ కాంగ్రెస్



ఆదాల ప్రభాకర్‌రెడ్డి – నెల్లూరు లోక్‌సభ
పి.అనిల్‌కుమార్‌యాదవ్ – నెల్లూరు నగరం
కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి – నెల్లూరు గ్రామీణం
కాకాణి గోవర్ధన్‌రెడ్డి – సర్వేపల్లి
కిలివేటి సంజీవయ్య – సూళ్ళూరుపేట (ఎస్సీ)
వి.వరప్రసాద్ – గూడూరు (ఎస్సీ)




బల్లి దుర్గాప్రసాద్ – తిరుపతి లోక్‌సభ (ఎస్సీ)
ఆనం రామనారాయణరెడ్డి – వెంకటగిరి
మేకపాటి గౌతమ్‌రెడ్డి – ఆత్మకూరు
మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి – ఉదయగిరి
రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి – కావలి
నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి – కోవూరు

## తెలుగుదేశం



బీద మస్తాన్‌రావు – నెల్లూరు లోక్‌సభ
పి.నారాయణ – నెల్లూరు నగరం
షేక్ అబ్దుల్ అజీజ్ – నెల్లూరు గ్రామీణం
సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి – సర్వేపల్లి
పరసా రత్నం – సూళ్ళూరుపేట (ఎస్సీ)
పాశం సునీల్‌కుమార్ – గూడూరు(ఎస్సీ)



పనబాక లక్ష్మి – తిరుపతి లోక్‌సభ(ఎస్సీ)
కురుగొండ్ల రామకృష్ణ – వెంకటగిరి
బొల్లినేని కృష్ణయ్య – ఆత్మకూరు
బొల్లినేని రామారావు – ఉదయగిరి
కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి – కావలి
పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి – కోవూరు

## బీజేపీ



సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి – నెల్లూరు లోక్‌సభ
కాకరపర్తి జగన్మోహన్‌రావు – నెల్లూరు నగరం
కరణం భాస్కర్‌రావు – నెల్లూరు గ్రామీణం
గుండ్లపల్లి భరత్‌కుమార్ – ఉదయగిరి
కర్నాటి ఆంజనేయరెడ్డి – ఆత్మకూరు
కందుకూరు సత్యనారాయణ – కావలి

## కాంగ్రెస్



చేవూరు దేవకుమార్‌రెడ్డి – నెల్లూరు లోక్‌సభ
చింతా మోహన్ – తిరుపతి లోక్‌సభ (ఎస్సీ)
ఫయాజ్ – నెల్లూరు నగరం
ఉడతా వెంకటరావ్‌యాదవ్ – నెల్లూరు గ్రామీణం
చేవూరు శ్రీధర్‌రెడ్డి – ఆత్మకూరు
చింతాల వెంకట్రావ్ – కావలి

## జనసేన కూటమి



చంద్ర రాజగోపాల్ (సిపిఎం) – నెల్లూరు లోక్‌సభ
కేతంరెడ్డి వినోద్‌రెడ్డి – నెల్లూరు నగరం
మనుక్రాంత్ చెన్నారెడ్డి – నెల్లూరు గ్రామీణం
తెళ్ళపల్లి రాఘవయ్య – కోవూరు
పసుపులేటి సుధాకర్ – కావలి
సుంకర హేమలత – సర్వేపల్లి

## ఆ పార్టీలలో...

# వారిని వూహించుకోలేక పోతున్నారు!





కొన్ని పార్టీల జెండాలు కొందరికి సెట్ కావు. వారి మెడల్లో ఏ పార్టీ కండువా అంటే ఆ పార్టీ కండువా వుంటే అనుచరులు, అభిమానులు జీర్ణించుకోలేరు. ఇప్పుడు జిల్లా రాజకీయాలలో కావలి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పరిస్థితి ఇదే! కావలి వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సీటివ్వొద్దంటూ పార్టీతో ఆయన లొల్లి పెట్టుకున్నాడు. ఆయనకు సీటిస్తే తాను మద్దతునిచ్చేది లేదని హెచ్చరించాడు. అయినా జగన్ ఆయనకే సీటిచ్చాడు. దీంతో కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అలిగి తెలుగుదేశంలో చేరాడు. మొన్న చంద్రబాబు నెల్లూరొచ్చినప్పుడు ఆయన చేతులమీదుగా పసుపు కండువా కప్పుకున్నాడు. ఇప్పటివరకు సాగిన ఆయన రాజకీయ పయనానికి, ఇప్పుడు కట్టుకున్న పసుపు కండువాకు ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. ఆయన మెడపై పసుపు కండువాను ఆయన అభిమానులే జీర్ణించుకోలేక పోతున్నారు. ఆయన రాజకీయ ప్రయాణం ఎక్కువకాలం కాంగ్రెస్‌లోనూ, అందులోనూ వై.యస్.రాజశేఖరరెడ్డి అనుబంధంతోనూ కొనసాగింది. కాంగ్రెస్ తర్వాత వైసిపిలో కొనసాగాడాయన. ఇదేం పెద్ద మార్పు కాదు. కాని, ఇంతకాలం అల్లూరు ప్రాంతంలో తెలుగుదేశం వాళ్ళతోనే పోరాడిన ఆయన, ఇప్పుడు అదే తెలుగుదేశం జెండాతో ప్రజల ముందుకు పోతున్నాడు. ఈ పరిస్థితి ఆయన అనుచరులకు మింగుడు పడకుండాపోయింది.

అలాగే, సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో వుండి కేంద్రమంత్రిగా పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేసిన పనబాక లక్ష్మి మెడలో పసుపు కండువ, తెలుగుదేశంలో మూడు దశాబ్దాల అనుబంధం వున్న బల్లి దుర్గాప్రసాద్ రావు మెడలో వైసిపి కండువా కూడా ఊహ కందని పరిణామమే!

# బల్లికి భలే ఛాన్స్




2019 ఎన్నికలకు సంబంధించి లక్కీయస్ట్ పర్సన్ ఎవరంటే మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్. 1985 నుండి అతను కనిపెట్టుకుని వున్న తెలుగుదేశం పార్టీ వాళ్ళు గూడూరు అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకపోతే వైసిపివాళ్ళు మాత్రం ఏకంగా తిరుపతి పార్లమెంటు టిక్కెట్టే ఇచ్చారు. తిరుపతి(ఎస్సీ) లోక్‌సభ నియోజక వర్గం వైసిపి అభ్యర్థిగా బల్లి దుర్గాప్రసాద్ పేరును ఖరారు చేయడం జరిగింది. పేరును ఖరారు చేసే ముందురోజే ఆయన వైసిపిలో చేరారు. 2014 ఎన్నికల్లో ఇదే లోక్‌సభ నుండి వైసిపి ఎంపీగా గెలిచిన వి.వరప్రసాద్‌ను ఈ ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నుండి నిలబెడుతున్నారు.

బల్లి దుర్గాప్రసాద్‌కు అనుకోని ఛాన్స్ ఇది. బల్లి తెలుగుదేశంను వదులుతాడని ఎవరూ వూహించలేదు. కాని వరుసగా రెండు ఎన్నికల్లో టిక్కెట్లు రాకపోవడంతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

వైసిపివాళ్ళు మొదట తిరుపతికి పారిశ్రామికవేత్త ఎం.మధుసూదన్‌రావు పేరును అనుకున్నారు. కాని ఎన్నికల తేదీ దగ్గరపడడంతో కొత్తవాళ్ళైతే ఇబ్బంది పడతారని నియోజకవర్గంపై బాగా అవగాహన, పరిచయాలు వున్న బల్లి దుర్గాప్రసాద్‌ను రంగంలోకి దించారు.

# వెన్నెలకంటికి డాక్టరేట్



నెల్లూరుజిల్లా వాసి, ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్‌కు ఈ నెల 20న అమెరికాలోని డెన్సిస్ నగరంలోని థియోలాజికల్ అకాడమీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. 1882 నాటి యూసీటీసీకు చెందిన అకాడమీ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును డాక్టర్ మార్టిన్, డాక్టర్ స్టీన్‌పాల్, డాక్టర్ రిచర్డ్‌గార్డ్‌లు వెన్నెలకంటికి అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ఆయన అభిమానులు, కళాసంస్థలు, కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలు, కవులు వెన్నెలకంటికి శుభాభినందనలు తెలిపారు.

# ఆయన మాట.. గెలుపుకు బాట!

## విపిఆర్ సెంటిమెంట్‌తో వైసిపి తొలిజాబితా ప్రకటన



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అంటే అటు సేవారంగంలోనూ ఇటు ఆథ్యాత్మిక రంగంలోను తెలియనివారు లేరు. అపర దానకర్ణుడిగా సేవారంగానికి వారధిగా, దైవ కార్యక్రమాలను నిత్యం ప్రజల్లోకి తీసుకెళ్ళి ఆథ్యాత్మిక రంగానికి సారధిగా ఆయన ప్రస్థానం అసమానం.. అసామాన్యం. ఇప్పుడు రాజకీయ రంగంలో కూడా ఆయన తనదైన ముద్ర వేసుకుంటున్నాడు. వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీలో అత్యంత కీలకమైన వ్యక్తిగా వుంటూనే మంచివాడిగా మంచి మనసున్న వాడిగానే కాకుండా ఆయన సంకల్పించే ఏ పనైనా దిగ్విజయం అవుతుందనే సెంటిమెంటుని అటు పార్టీ అధినేతకీ ఇటు పార్టీ అభిమానులకు కలిగేలా చేశాడు.

2019 ఏప్రియల్ 11న జరుగనున్న ఎన్నికలకు సంబంధించిన తొలి జాబితాను సైతం విపిఆర్ చేత ప్రకటింపజేసి నిష్కల్మషమైన ఆయన మనస్తత్వాన్ని, కలిసొచ్చే ఆయన హస్తవాసిని అందరికీ తెలిసేలా చేశాడు పార్టీ అధినేత. విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర నిర్ణయించిన ముహూర్తాన 16వ తేదీన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేత శుభసూచకంగా 9మంది పార్లమెంటు అభ్యర్థుల జాబితాను ప్రకటించాడు. ఆయన ప్రకటించిన అభ్యర్థుల ఫోటోలు అదేరోజు టీవీలలో, పక్కరోజు పత్రికలలో ప్రచురితమయ్యాయి. ప్రకటించిన 9మంది అభ్యర్థులకే రాష్ట్ర వ్యాప్తంగా విపరీత స్పందన వచ్చింది. ప్రకటించిన ఆ 9మంది అభ్యర్థులపై సానుభూతి కూడా వచ్చింది. ఆ పక్కరోజే మిగిలిన 16 లోక్‌సభ స్థానాల అభ్యర్థులను, 175 అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను ఒకేసారి ప్రకటించారు. అభ్యర్థుల ప్రకటనకు నిర్ణయించిన ముహూర్తబలమో, లేక వేమిరెడ్డి హస్తవాసి, వాక్‌శుద్ధి ప్రభావమో గాని ఆరోజు నుండే రాష్ట్రంలో వైసిపి వూహించని విధంగా పుంజుకుంది.



# రాజకీయ కుటుంబాలన్నీ వైకాపాలోనే..

## 2004ను తలపిస్తున్న 2019

ప్రస్తుతం నెల్లూరు జిల్లా రాజకీయాలలో చోటుచేసుకున్న వాతావరణం చూస్తుంటే 2004నాటి వాతావరణం కనిపిస్తోంది. ఇందులో చాలా కొద్దిమార్పులే వున్నాయి. ఆరోజు జిల్లాలోని పెద్ద రాజకీయ కుటుంబాలన్నీ కూడా కాంగ్రెస్‌లో వుండినాయి. నేదురుమల్లి, ఆనం, మేకపాటి, మాగుంట, పనబాక, ఆదాల... ఇలా బలమైన నాయకత్వమంతా కాంగ్రెస్‌లో వుండడం, ఆ ఎన్నికల్లో ఒక్క ఆత్మకూరు తప్పితే మిగతా 10సీట్లు, నెల్లూరు, తిరుపతి లోక్‌సభలో కాంగ్రెస్ గెలవడం చూశాం.

ఆనాటి పరిస్థితులే మళ్ళీ ఈ ఎన్నికలలోనూ కనిపిస్తున్నాయి. జిల్లా వైసిపిలో 2014 ఎన్నికల్లో కనిపించని వాతావరణం 2019 ఎన్నికల్లో కనిపిస్తోంది. జిల్లాకు చెందిన పెద్ద రాజకీయ కుటుంబాలన్నీ కూడా ఈరోజు వైసిపిలో వున్నాయి. మాగుంట, ఆనం, నేదురుమల్లి, నల్లపరెడ్డి, మేకపాటి, ఆదాల... ఇలా అందరూ ఈరోజు వైసిపిలో వున్నారు.

2004లో కాంగ్రెస్‌లో లేని నల్లపరెడ్డి కుటుంబం ఈరోజు అదనంగా వైసిపిలో వుంది. పనబాక, కాటంరెడ్డి విష్ణు లాంటి 2004 బ్యాచ్ వాళ్ళు టిడిపిలో చేరడమే కొంతలోటు. కాకపోతే వీరి ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. జిల్లాలో రాజకీయ వాతావరణం 2004ను తలపిస్తోంది. మరి ఫలితాలు కూడా 2004ను తలిపించేలా వుంటాయో లేదో చూడాలి!?

# ఊపందుకున్న నామినేషన్ల పర్వం




నామినేషన్ దాఖలు చేస్తున్న సూళ్లూరుపేట వైసిపి అభ్యర్థి సంజీవయ్య



నామినేషన్ దాఖలు చేస్తున్న నెల్లూరు సిటి వైసిపి అభ్యర్థి అనిల్

జిల్లాలో రెండు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల పర్వం వూపందుకుంది. ఈ నెల 25వ తేదీదాకా నామినేషన్లకు గడువు వుంది. ఈ నెల 20వ తేదీన సూళ్లూరుపేట వైసిపి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయుడుపేట ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఆత్మకూరు వైసిపి అభ్యర్థిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి, కోవూరు వైసిపి అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. కావలిలో జనసేన అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ 20వ తేదీనే నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 21వ తేదీ తిరుపతి తెలుగుదేశం ఎంపి అభ్యర్థిగా పనబాక లక్ష్మి, సర్వేపల్లి వైసిపి అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగరం వైసిపి అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఉదయగిరి వైసిపి అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. 23, 24వ తేదీలలో సెలవు దినాలు కావడంతో మిగిలిన అభ్యర్థుల నామినేషన్లన్నీ కూడా 22, 25తేదీలలో పడనున్నాయి.




నామినేషన్ దాఖలు చేస్తున్న కోవూరు వైసిపి అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి



నామినేషన్ దాఖలు చేస్తున్న తిరుపతి తెదేపా లోక్‌సభ అభ్యర్థి పనబాక లక్ష్మి

## 'ప్రభా'తం

*'నిజమైన దేశభక్తుడు, నిరుపమాన నాయకుడు, పరిపాలనాదక్షుడు.. మనోహర్ పారికర్. దేశానికి ఆయన చేసిన సేవలు తరతరాలకు గుర్తుండిపోతాయి'*

\- ప్రధాని నరేంద్రమోడీ

# వ్యక్తి కాదు.. దేశ భ(శ)క్తి!



**తమ ప్రతిభాపాటవాలతో రాజకీయాల్లో ఉద్దండులుగా రాణించేవారు ఎందరో ఉంటారు. అయితే, ఎంత ఉన్నతపదవుల్లో ఉన్నా అత్యంత నిరాడంబరంగానే ఉంటూ దేశానికి అసామాన్యమైన సేవలందించేవారు ఎందరుంటారు?... అనుకున్నప్పుడు, మనకు వెంటనే గుర్తొచ్చే పేరు.. మనోహర్ పారికర్. రాజకీయాల్లో అత్యంత నిరాడంబరునిగా, నిజాయతీపరునిగా, ప్రజాహృదయ నేతగా ఉంటూ భరతమాత ముద్దుబిడ్డగా పేరొందిన పారికర్ వంటి మహనీయ నేతల్ని కోల్పోవడం బీజేపీకే కాదు.. దేశానికే తీరని లోటు.**

"పారికర్ మృతితో దేశం ఒక గొప్ప పరిపాలనాదక్షుడిని కోల్పోయింది. పారికర్ 'సామాన్యప్రజల ముఖ్యమంత్రి'. నిరాడంబరమైన జీవితంతో, గొప్పనేతగా ఆయన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతారు''.. పారికర్‌కు కేంద్ర క్యాబినెట్ కన్నీటి నివాళి.

నిరాడంబరత్వానికి మారుపేరు. రాజకీయరంగంలో నిజాయితీ రాజకీయాలకు మరో పేరుగా నిలిచిన మంచినేతల్లో ఒకరు..మనోహర్ పారికర్. అత్యంత సామాన్యుడు..అసామాన్యునిగా ఎదిగి ప్రజల గుండెల్లో మహనీయమైన నేతగా శాశ్వతస్థానం సంపాదించుకున్నారు. అకుంఠిత దేశభక్తితో, అత్యంత సేవాభిలాషతో రాజకీయరంగంలోకి వచ్చి ప్రజల మనసుల్లో మహనీయమైన నేతగా నిలిచిపోయిన మహానేత..పారికర్. సాధారణంగా రాజకీయాల్లో తమ ప్రతిభాపాటవాలతో ఉద్దండునిగా రాణించేవారు ఎందరో ఉన్నారు. కానీ, ఎంతో ఉన్నత పదవుల్లో ఉన్నా అత్యంత నిరాడంబరమైన జీవనశైలితో, సామాన్యునిగా ఉంటూనే దేశానికి అసామాన్యమైన సేవలు చేసేవారు ఎవరుంటారు?...అనుకున్నప్పుడు, మనకు వెంటనే గుర్తొచ్చే పేరు..మనోహర్ పారికర్. నిజాయతీకి- నిబద్ధతకు నిలువుటద్దంగా, నిరాడంబరతకు ప్రతీకగా నిలిచిన ప్రజానేత పారికర్. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 63 ఏళ్ళ వయసులో.. ఈనెల 17న ఆ ప్రజాహృదయనేత కన్నుమూశారు. దేశంలో ఎన్నికల యుద్ధం ఆరంభమైన ఈ తరుణంలో పారికర్ వంటి మహానాయకుని మృతి బిజెపికి పెద్ద లోటు అనే చెప్పవచ్చు.

రాజకీయరంగంలో ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి వంటి ఉన్నతపదవులను అధిష్ఠించినా... ఒక సామాన్యమైన వ్యక్తిలాగానే జీవించే అరుదైన వ్యక్తిత్వం.. మనోహర్ పారికర్‌ది. అంతేకాదు, నీతి-నిజాయతీ లకు నిలువెత్తు రూపంగా నిలవడమే పారికర్‌లోని గొప్పతనం. అందుకే ప్రజలకు ఆయనంటే ఎంతో అభిమానం. అధికార ఆర్భాటాలు ఆయనకు నచ్చవు. విమానాశ్రయానికి కూడా ఆటోలోనే రావడం, తన లగేజీని తనే తీసుకురావడం, అలా అత్యంత నిరాడంబరంగా జీవించడమంటేనే ఆయనకు ఇష్టం. తన విశిష్టమైన వ్యక్తిత్వంతో, విలక్షణమైన రాజకీయాలతో ఆధునిక గోవా నిర్మాతగా, గోవా ప్రజల ముద్దుబిడ్డగా పారికర్ విఖ్యాతి చెందారు. నాలుగుసార్లు గోవా ముఖ్యమంత్రిగా, మూడేళ్లు కేంద్ర రక్షణశాఖ మంత్రిగా దేశానికి అనితరసాధ్యమైన సేవలందించారు. తాను ఆరెస్సెస్ భావాలతో ఉన్నా, రాజకీయాల్లో అందరివాడిగా రాణించాడు. అజాతశత్రువుగా పేరొందాడు. ఆయన రాజకీయ జీవితం, సామాజిక నిరాడంబర జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమే.

1955లో గోవాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన పారికర్, పాఠశాల దశలోనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై కార్యకర్తగా చేరి, ఆర్ఎస్ఎస్ ప్రచారకునిగా గోవా అంతా తిరిగేవారు. 1978లో ముంబై ఐటిఐలో ఇంజనీరింగ్ చదువుకుని, ఆ తర్వాత 1990లలో రామజన్మభూమి ఉద్యమంపై గోవాలో విస్తృత ప్రచారం చేయడంతో బిజెపి ప్రముఖులకు పారికర్ పట్ల అభిమానం ఏర్పడింది. అప్పట్లో ప్రాంతీయపార్టీగా ఉన్న మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ ప్రభావం గోవాప్రజల్లో బాగా ఉండేది. ఆ పార్టీ ప్రాబల్యానికి అడ్డుకట్టవేసేందుకు బిజెపి పారికరే తగ్గ నాయకుడని భావించి ఆ బాధ్యతను అప్పగించింది. అలా క్రమేణా రాజకీయరంగంలోకి ప్రవేశించిన పారికర్, 1991 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఓటమి చూసినా, 1994లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పనాజి నుంచి పోటీచేసి విజయం సాధించారు. అప్పట్లో తాను ప్రతిపక్ష నాయకునిగా ఉన్నా, ఆ తర్వాత జరిగిన రాజకీయపరిణామాల్లో 2000 అక్టోబర్‌లో పారికర్ గోవా ముఖ్యమంత్రిగా అత్యున్నతమైన బాధ్యతలు చేపట్టారు. ఐఐటి చదువుకున్న తొలి సిఎంగా ఆయన పేరొందారు. అప్పుడు రెండేళ్ళపాటు సిఎంగా ఉన్నారు. ఆ తర్వాత మారిన రాజకీయాల్లో మళ్ళీ 2002లో కూడా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, 2005లో సిఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత 2007లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2012 ఎన్నికల నాటికి మళ్ళీ బిజెపి పుంజుకుంది. పారికర్ నేతృత్వంలో గోవాలో మొత్తం 40 స్థానాలకు గాను 21 స్థానాల్లో బిజెపి ఆధిక్యత సాధించి పారికర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావడం విశేషం. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కూడా గోవాలో బిజెపి ఆధిక్యత కొనసాగుతూ వచ్చింది. ఈ ఎన్నికలకు ముందు, గోవాలో జరిగిన బిజెపి సమావేశంలో ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ పేరును ప్రతిపాదించింది కూడా పారికరే కావడం మరో విశేషం. ప్రధానిగా మోడీ పదవిని అధిష్ఠించిన తర్వాత, గోవాకు ముఖ్యమంత్రిగా ఉన్న పారికర్‌కు కేంద్ర రక్షణమంత్రిత్వ శాఖ పదవిని అప్పగించిందంటే పారికర్ విశిష్టమైన వ్యక్తిత్వానికి నిదర్శనంగా భావించవచ్చు. అయితే, ఆ తర్వాత 2017లో గోవాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి మెజార్టీ రాకపోవడంతో, తిరిగి ఆయన రాష్ట్రానికి వచ్చి ఇతరపార్టీల సహకారాన్ని కూడగట్టి గోవాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. అంతటి సమర్థవంతుడైన ప్రజానేత పారికర్. అంతెందుకు, పారికర్ సిఎంగా ఉంటేనే బిజెపికి మద్దతు ఇస్తామని మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ, గోవా ఫార్వర్డ్ పార్టీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా స్పష్టంగా చెప్పున్నా రంటే పారికర్ నిజాయితీ రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి... పారికర్ మృతితో ఇప్పుడు గోవా రాజకీయాలు గందరగోళస్థితిలో పడ్డాయి. దేశరాజకీయాల్లో అజాతశత్రువుగా, నిరాడంబరునిగా.. నిజాయతీపరునిగా, రాజనీతిజ్ఞునిగానే కాక అకుంఠిత దేశభక్తితో భరతమాత ముద్దుబిడ్డగా పేరొందిన పారికర్ మృతి.. ఎంతైనా బాధాకరం. ఇలాంటి మహనీయమైన నేతల్ని కోల్పోవడం బిజెపికే కాదు... దేశం మొత్తానికే తీరని లోటు.

# శ్రీ సాయి సేవా పురస్కారాలు ప్రదానం



శ్రీ సాయి సేవా పురస్కారాలను అందుకున్న సాయి సేవకులు

ఆనంద సాయి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కర్లపూడి కృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 17న నెల్లూరులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో సాయి సేవలో నిరంతరం తరించిన సాయి భక్తులకు శ్రీ సాయిసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. నెల్లూరులోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం వ్యవస్థాపకుడు మధుసూదనసాయి, కోటకు చెందిన అల్లం రమణయ్య,నాగలాపురం గిరిధర్‌రెడ్డి, నెల్లూరుకు చెందిన కృష్ణాపురం శ్రీనివాసరావు, కోదండ వరదరామస్వామిలను సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. విశ్రాంత ఏఎస్పీ ఏసీ నాగేశ్వరరావు, డిఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.వి.చలమయ్య

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని పొట్టి శ్రీరాములు అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి. చలమయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 16న నెల్లూరుజిల్లా పల్లెపాడు పినాకిని గాంధీ ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు 118వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిలో మహాత్మాగాంధీ స్మృతివనం ప్రక్కన పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంటు ఆవరణలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అసెంబ్లీ, పార్లమెంటు హాలులో ఆయన చిత్రపటాలను పెట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకూరుపేట తహశీల్దార్ సీతామహాలక్ష్మి, పినాకిని గాంధీ ఆశ్రమం కన్వీనర్ జి.కృష్ణారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం, సభ్యులు గూడూరు లక్ష్మి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## దిగజారిపోయాడు

సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ప్రజలలో నమ్మకాన్ని పోగొట్టుకున్నాడు. ఇతను మొదట చిత్తశుద్ధి కలిగిన ఆఫీసర్ అని అందరూ నమ్మారు. కాని ఇటీవల తెలుగుదేశంలో చేరాలనుకోవడం, ఆపై జనసేనలో చేరడం చూస్తుంటే జగన్ వ్యతిరేక శక్తుల కుట్రలో ఇతనూ ఓ భాగస్వామి అని తెలుస్తోంది. ఈమధ్యంతా ధర్మసూత్రాలు గురించి, భగవద్గీత గురించి ఉపన్యాసాలు దంచాడు. ఇప్పుడు మాత్రం ఆవులను చంపితే తప్పేంటన్న పిచ్చి పవన్‌కళ్యాణ్ పార్టీలో చేరి తన నైజాన్ని బయటపెట్టుకున్నాడు.

**పట్నం సుందర్‌రావు, నెల్లూరు.**

## ఆదర్శనేత పారికర్

గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది. నిరాడంబరుడైన నాయకుడు, నిజాయితీకి నిలువుటద్దం. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఎంత ఉన్నతమైన పదవుల్లో వున్నా సామాన్యుడిగానే వ్యవహరించిన వ్యక్తి. దేశంలో పది శాతం మంది నాయకులు మనోహర్ పారికర్‌లాగా వున్నా దేశం రూపురేఖలే మారిపోతాయి.

**జి.వాసు, తిరుపతి.**

## ఓటు హక్కు వాడుకుందాం

ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఒక పార్టీ వాళ్ళు కావాలనే చాలామంది ఓట్లు తీసేసారు. ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు. 'నోటా'కు వేయడం వృధా! వున్న అభ్యర్థుల్లో ఎవరు మంచోళ్ళు, వున్న పార్టీలలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే మంచిదో తెలుసుకుని మీ ఓట్లను ఉపయోగించుకోండి.

**లెక్కల సర్వేశ్వరప్రసాద్, నెల్లూరు.**

## వై.యస్.ను మరపించిన జగన్

రాష్ట్రంలోని 25లోక్‌సభ స్థానాలకు, 175 శాసనసభ స్థానాలకు వైసిపి అభ్యర్థులను ఎంపిక చేసిన విధానం అదిరింది. ఈ విషయంలో వై.యస్.రాజశేఖరరెడ్డిని మరపించాడు జగన్మోహన్‌రెడ్డి. టిక్కెట్ల కేటాయింపులో పేదలకు, బలహీనవర్గాల వారికి పెద్దపీట వేయడం అభినందనీయం. అలాగే టిక్కెట్ల కేటాయింపులో విద్యావంతులు అధికంగా ఉండడం విశేషం. టిక్కెట్ల కేటాయింపులోనే జగన్ సగం విజయం సొంతం చేసుకున్నట్లైంది.

**చల్లా విద్యాసాగర్‌రెడ్డి, నెల్లూరు.**



# ఎన్నికల చదరంగం 2

## నాటి ఆత్మీయులే.. నేటి ప్రత్యర్థులు





రాజకీయాలు.... ప్రాణస్నేహితులను విడదీయగలవు, అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టగలవు, ఆత్మీయుల మధ్య అగ్గి రాజేస్తాయి... ప్రస్తుత రాజకీయాలలో ఇలాంటివి ఎన్నో చూస్తున్నాం. అన్న ఒక పార్టీలో, తమ్ముడు ఇంకో పార్టీలో. తండ్రి ఒక జెండా... కొడుకుది మరో జెండా. ఒకే కారులో ప్రయాణించే స్నేహితులు పదవుల కోసం పక్కరోజే ఒకరిపై ఒకరు ప్రత్యర్థులుగా పోటీపడడం... అలాంటి దృశ్యకావ్యాలే ఇప్పుడు నెల్లూరుజిల్లా రాజకీయ తెరపై ఆవిష్కృతమయ్యాయి.

నెల్లూరు పార్లమెంటు నుండి వైసిపి అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా బీద మస్తాన్‌రావులు ఖరారు కావడం జరిగింది. వీళ్ళు ఇప్పుడు ప్రత్యర్థులు. ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే వీళ్లిద్దరూ ఆత్మీయులు. ఒకే మండలానికి చెందినవాళ్ళు. ఒకే పార్టీ నుండి రాజకీయ అడుగులు వేసినవాళ్ళు. 1999 ఎన్నికల్లో ఆదాల రాజకీయ అరంగేట్రం చేసి అల్లూరు నుండి పోటీ చేశాడు. ఆ ఎన్నికల్లో ఆదాల గెలుపు కోసం బీద బ్రదర్స్ కృషి చేశారు. 2000లో జరిగిన జడ్పీ ఎన్నికల్లో బీద రవిచంద్రను జడ్పీ ఛైర్మెన్ చెయ్యాలని ఆదాల ఎంతగానో ప్రయత్నించాడు. కాని అప్పుడది మిస్సయ్యింది. 2004లో పరిస్థితులు మారి ఆదాల కాంగ్రెస్‌లోకి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు బీద రవిచంద్ర తెలుగుదేశంలోనే వుండిపోగా, బీద మస్తాన్‌రావు మాత్రం ఒక దశలో ఆదాల వెంట కాంగ్రెస్‌లోకి వెళ్లడానికి రెడీ అయ్యి, ఆయనతో పాటు ప్రెస్‌మీట్‌లో కూడా పాల్గొన్నాడు. అయితే పక్కరోజే నిర్ణయం మార్చుకుని టిడిపిలో ఉండిపోవడమే కాక, ఆ ఎన్నికల్లో అల్లూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా నిలబడ్డాడు. అప్పటినుండి 2014 దాకా వీరిమధ్య గ్యాప్ వచ్చింది. 2014 ఎన్నికలొచ్చే సరికి ఆదాల తెలుగుదేశంలోకొచ్చి నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయడం, బీద మస్తాన్‌రావు కావలి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీకి దిగడం.. ఇద్దరూ ఓడిపోవడం తెలిసిందే! అయినా ఐదేళ్ళుగా వీరిమధ్య సాన్నిహిత్యం కొనసాగింది.

ఇప్పుడు మళ్ళీ సీన్ మారింది. ఉరుములేని పిడుగులాగా తెలుగుదేశం నుండి వైసిపిలోకి వెళ్లిన ఆదాల ఆ పార్టీకి నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి అయ్యాడు. ఇక మొదటి నుండి వూహిస్తున్నట్లే మస్తాన్‌రావు టిడిపి ఎంపి అభ్యర్థి అయ్యాడు. వీరిద్దరి మధ్య ప్రత్యక్ష పోరాటం జరగడం ఇదే తొలిసారి! ఆదాల చేరడంతోటే జిల్లా వైసిపిలో జోష్ పెరిగింది. టిడిపిలో నిరుత్సాహం ఆవరించింది. గట్టిపోటీ వుంటుందనుకున్న పలు అసెంబ్లీలలో ఒక్కసారిగా మొగ్గ వైసిపి వైపు మళ్లింది. టిడిపిని పెట్టాక ఈ పార్లమెంట్‌లో ఆ పార్టీ కేవలం రెండుసార్లే (1985, 1989) గెలిచింది. అంటే ఒకప్పుడు కాంగ్రెస్‌కు, ఇప్పుడు వైసిపికి బలమైన స్థానం. మరి ఈ గురు శిష్యుల పోరాటంలో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి!

## తిరుపతి... ఎవరిదో పరపతి





తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం... పేరుకు చిత్తూరుజిల్లా అయినా ఈ లోక్‌సభలో ఆధిపత్యం నెల్లూరుజిల్లాదే! ఈ లోక్‌సభ పరిధిలో చిత్తూరు జిల్లాకు సంబంధించి మూడు అసెంబ్లీలు(తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు) వుంటే నెల్లూరు జిల్లాకు సంబంధించి నాలుగు నియోజకవర్గాలు(సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి) వున్నాయి. ఆటోమేటిగ్గా ఈ నాలుగు అసెంబ్లీలలో పైచేయి సాధించిన అభ్యర్థికి గెలుపు అవకాశాలు ఎక్కువగా వుంటుంటాయి.

తిరుపతి పార్లమెంటు అభ్యర్థులు కూడా ఈసారి నెల్లూరుజిల్లా వాళ్ళే! అందులోనూ గూడూరు నియోజకవర్గానికి చెందిన వాళ్ళే! విచిత్రమేమిటంటే ఇద్దరు అభ్యర్థులు కూడా ముందురోజు పార్టీలో దూరి సీట్లు తెచ్చుకున్నవాళ్లే!

కాంగ్రెస్‌పార్టీలో సోనియాగాంధీకి వీరవిధేయురాలిగా వున్న మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి ఉన్నఫళంగా తెలుగుదేశంలో చేరింది. ఆ పార్టీ నుండి టిడిపి తిరుపతి ఎంపి అభ్యర్థి అయ్యింది. వైసిపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్ చూస్తే తెలుగుదేశంతో వున్న మూడు దశాబ్దాలపైన అనుబంధాన్ని తెంపుకుని వైసిపిలో చేరాడు. తిరుపతి ఎంపి అభ్యర్థి అయ్యాడు.

అభ్యర్థుల బలాబలాల సంగతికొస్తే ఇద్దరూ రాజకీయ అనుభవజ్ఞులే! పేరుకు రిజర్వుడ్ నియోజకవర్గం అనేగాని ఈసారి పోటీ రసవత్తరంగా వుండబోతుంది. పనబాక లక్ష్మి కాంగ్రెస్‌లో చాలా సీనియర్. నెల్లూరు పార్లమెంట్ నుండి ఐదుసార్లు పోటీ చేసి నాలుగుసార్లు గెలిచింది. 2009 ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ నుండి గెలిచింది. మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసింది. రాజకీయాలు బాగా తెలిసిన మనిషి. బాగా పరిచయాలున్నాయి. సొంతంగా కూడా పోరాడగలదు.

ఇటు చూస్తే వైసిపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్ పనబాక కన్నా చాలా సీనియర్. గూడూరు అసెంబ్లీ నుండి ఐదుసార్లు పోటీ చేశాడు. నాలుగుసార్లు గెలిచాడు. చంద్రబాబు మంత్రివర్గంలో పని చేశాడు. సాధారణ వ్యక్తిగా పేరుంది. ప్రజల్లోకి బాగా కలిసిపోతాడు. తిరుపతి పరిధిలోని అసెంబ్లీలపై అవగాహన వున్న నాయకుడు. నెల్లూరుజిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసిపి పరిస్థితి మెరుగ్గా వుంది. చిత్తూరుజిల్లాలోని మూడు అసెంబ్లీలలో ఈసారి హోరాహోరీ వుండొచ్చు. 2014 ఎన్నికల్లో ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీలలో వైసిపి నాలుగు గెలవగా, టిడిపి మూడు గెలుచుకుంది. గెలిచిన నాలుగులో మూడు నెల్లూరుజిల్లాలో నివే! ఇక్కడొచ్చిన మెజార్టీలతోనే అప్పుడు ఎంపీగా వరప్రసాద్ విజయం సాధించాడు. ఈసారి కూడా నెల్లూరులోని అసెంబ్లీ విజయాలను బట్టే తిరుపతి ఎంపి ఎవరనేది తేలబోతుంది.!

## ఉదయగిరి... గెలుపుపై ఇద్దరి గురి





పేరుకు వెనుకబడిన ప్రాంతమైన రాజకీయ చైతన్యంలో ముందున్న నియోజకవర్గం ఉదయగిరి. జిల్లాలోనే ఈ నియోజకవర్గానిది ప్రత్యేకశైలి. బెజవాడ గోపాల్‌రెడ్డి, యం.వెంకయ్యనాయుడు లాంటి యోధులు రాజకీయ పురుడుపోసుకున్నది ఈ గడ్డమీదే! ఈ నియోజకవర్గం ఎంత ప్రత్యేకమైందో చెప్పడానికి ఓ రెండు ఉదాహరణలు చాలు. 1978 ఎన్నికల్లో ఇందిరమ్మ ప్రభంజనంలో జిల్లాలో పది అసెంబ్లీ సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంది. కాని ఉదయగిరిలో మాత్రం జనసంఘ్ అభ్యర్థిగా నిలబడ్డ యం.వెంకయ్యనాయుడు అనూహ్య విజయం సాధించాడు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనం... జిల్లాలో పది సీట్లను తెలుగుదేశం గెలిస్తే ఉదయగిరిలో మాత్రం బీజేపీ అభ్యర్థిగా వెంకయ్యనాయుడు రెండోసారి గెలిచాడు. ఉదయగిరి ప్రజలు ప్రభంజనాలకన్నా అభ్యర్థుల గుణగణాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారనేందుకు ఈ ఉదాహరణలు చాలు.

ఈ ఎన్నికల్లో ఉదయగిరి అభ్యర్థులుగా పాతవాళ్ళే పోటీ పడుతున్నారు. వైసిపి అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, అనేక పరిణామాల అనంతరం తెలుగుదేశం ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఖరారయ్యారు. 8మండలాలతో వున్న నియోజకవర్గమిది. భౌగోళికంగా పెద్దది. అభ్యర్థులకు తిరగడానికి టైం సరిపోదు.

ఇక టిడిపి అభ్యర్థి బొల్లినేని రామారావుకు వరుసగా ఇది మూడో ఎలక్షన్. 2012 ఉపఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆయన 2014లో ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. నియోజకవర్గంలో కొంత వరకు పనులు చేశాడు. అయితే ఆయన ప్రజలకు అందుబాటులో వుండడనే పేరుంది. మహారాష్ట్రలో కాంట్రాక్ట్ పనుల మూలంగా ఇక్కడ దొరకడం కష్టం. మండలస్థాయి నాయకుల్లో కూడా కొందరికి మాత్రమే అందుబాటులో వుండేవాడు. ఉదయగిరి నుండి గెలిచిన గత ఎమ్మెల్యేలకు భిన్నంగా బొల్లినేని వ్యవహరించాడు. అంతకుముందు ఎమ్మెల్యేలు ఎప్పుడూ జనం మధ్యే వుండేవాళ్ళు. పనిచేసినా చేయకున్నా వాళ్ళ పబ్లిసిటీ అదే! బొల్లినేని ఆ విషయంలో విఫలమయ్యాడు. ఇటీవల మహారాష్ట్రలో కొన్ని కాంట్రాక్ట్‌ల విషయంలో ఆయనపై ఆరోపణలు రావడం తెలిసిందే! అలాగే నీరు-చెట్టు పనుల్లో అవినీతి విమర్శలొచ్చాయి. నీరు-చెట్టు పనులు చేసినా తెలుగుదేశం నాయకులకు పూర్తిగా బిల్లులు చెల్లించలేదని, దీనిమూలంగానే టిడిపి నాయకులు ఆయనకు మళ్ళీ సీటు ఇవ్వొద్దంటూ అడ్డం తిరిగారని తెలుస్తోంది. అయినా కూడా చంద్రబాబు అతనిపై నమ్మకం వుంచి సీటిచ్చాడు. ఇప్పుడు నియోజకవర్గంలో ప్రభుత్వంపై వ్యతిరేకత వుంది. ఎమ్మెల్యేగా బొల్లినేనిపై వ్యతిరేకత వుంది. సొంత పార్టీలో వాళ్లే చాలామంది ఈసారి సహకరించే పరిస్థితి లేదు. నియోజకవర్గంలో వైసిపికి బలమెక్కువ. ఇన్ని ప్రతికూలతల మధ్య బొల్లినేని రామారావు ఏ మ్యాజిక్‌లు చేసి గెలుస్తాడో చూడాలి!

ఇక వైసిపి అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఇది వరుసగా ఆరో ఎలక్షన్. 1999, 2004, 2009, 2012, 2014లలో పోటీ చేశాడు. రెండుసార్లు కాంగ్రెస్ నుండి, ఒకసారి వైసిపి నుండి గెలిచాడు. 2014 ఎన్నికల్లో గెలుపుకు అవకాశమున్నా కొందరిని దూరం చేసుకోవడం వల్ల ఓడిపోయాడు. 2014కు ఇప్పటికీ నియోజకవర్గంలో పరిస్థితులు మారాయి. నియోజకవర్గంలో వైసిపి బలపడింది. కొందరు బలమైన నాయకులు పార్టీలో చేరారు. వాతావరణం వైసిపికి అనుకూలంగా వుంది. ఈ ఎన్నికల్లో కూడా మేకపాటి శేఖర్‌రెడ్డి గెలవకపోతే అంతకంటే దరిద్రం ఇంకోటి వుండదు!

## వెంకటగిరి... హోరాహోరీ





నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాల రాజకీయ పోరాటానికి వేదికగా నిలిచిందే వెంకటగిరి నియోజకవర్గం. ఇప్పటికీ అక్కడ ఆ కుటుంబాల రాజకీయ ఆనవాళ్ళు కనిపిస్తాయి. స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం ఇదే!

ఇలాంటి నియోజకవర్గం నుండి ఇద్దరు ఉద్దండులు ఇప్పుడు తలపడుతున్నారు. తెలుగుదేశం అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వైసిపి అభ్యర్థిగా మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే కురుగొండ్ల హ్యాట్రిక్ కొట్టినట్లే! మరి ఆయనకు ఇక్కడ అంత ఛాన్స్ వుందా? 2009 ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేసిన కురుగొండ్ల కాంగ్రెస్ అభ్యర్థి నేదురుమల్లి రాజ్యలక్ష్మిపై విజయం సాధించాడు. అంతకుముందు 2004 ఎన్నికల్లో ఆమె చేతిలోనే ఓడిపోయాడు. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యపై మరోమారు గెలిచాడు. అయితే ఈ ఐదేళ్లలో ఆయనపై వ్యతిరేకత వచ్చింది. గతంలోలేని విధంగా ఆరోపణలు, వివాదాలు వచ్చాయి. అసంతృప్తి పెరిగింది. సొంత పార్టీలోనే కొందరు ఎదురుతిరిగారు. అయినా కూడా చంద్రబాబు ఆయనకే సీటిచ్చాడు. ఇక్కడ మోటుకోవడానికి అంతకంటే బలమైన నాయకుడు టిడిపిలో లేదు.

ఇటు చూస్తే వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 1983 బ్యాచ్ నాయకుడు. సీనియార్టీలో అతనే అగ్రజుడు. 1983 నుండి ఇప్పటిదాకా అతను పోటీ చేయని ఎలక్షన్ లేదు. 1983లో నెల్లూరు, 1985, 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో రాపూరు, 2009, 2014 ఎన్నికల్లో ఆత్మకూరు... ఇప్పటిదాకా మొత్తం 8సార్లు అసెంబ్లీకి పోటీ చేశాడు. ఐదుసార్లు గెలిచాడు. 2014-2018ల మధ్య కాంగ్రెస్ నుండి టిడిపిలోకిపోయి, అక్కడనుండి వైసిపిలోకి వచ్చాడు. రావడంతోటే వెంకటగిరి అభ్యర్థి అయ్యాడు. ఆయన రావడంతోటే వెంకటగిరిలో పార్టీ మరింత పుంజుకుంది. ముఖ్యంగా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కొడుకు రామ్‌కుమార్‌రెడ్డి ఆయన గెలుపు కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాడు. నల్లపరెడ్లు, రాజాల సహకారం కూడా వుంది. వెంకటగిరి పట్టణంలో బీసీలు ఈసారి వైసిపి వైపు మొగ్గు చూపుతుండడం కూడా ఆయనకు కలిసొచ్చే అంశం.



# ప్రచారంలో కుటుంబసభ్యులు


ప్రచారం నిర్వహిస్తున్న నారాయణ సతీమణి రమాదేవి


ప్రచారం నిర్వహిస్తున్న అనిల్ సోదరుడు పి.రూప్‌కుమార్

ఎన్నికలంటే అభ్యర్థుల కంటే కూడా కుటుంబ సభ్యుల హడావిడి ఎక్కువగా ఉంటుంది. అభ్యర్థుల తరపున వారి తల్లిదండ్రులు, భార్యా బిడ్డలు ప్రచారం లోకి వస్తుంటారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో నెల్లూరులో పోటీ చేస్తున్న అభ్యర్థుల కుటుంబసభ్యులు ప్రచారంలో మునిగిపోయారు. ఇల్లిల్లూ తిరుగుతున్నారు. నెల్లూరు నగరం తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి పి.నారాయణ తరపున ఆయన భార్య రమాదేవి, కుమార్తె సింధూర విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎప్పుడూ వీధుల్లోకి రాని వీళ్ళు మొదటిసారి నెల్లూరు నగర రోడ్లపై ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఇక వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ తరపున ఆయన తల్లి శైలజమ్మ, సోదరుడు, కార్పొరేటర్ రూప్‌కుమార్ యాదవ్‌లు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పలు కాలనీలలో గడపగడప తిరుగుతూ తన బిడ్డను గెలిపించాలని కోరుతున్నారు. అసలు అభ్యర్థుల కంటే నగరంలో వారి కుటుంబసభ్యుల ప్రచారం ముమ్మరంగా ఉంది.

## నెల్లూరు కబుర్లు

### పోలీసు మృతుల కుటుంబాలకు
## చెక్కులు పంచిన ఏఎస్పీ


చెక్కును పంపిణీ చేస్తున్న ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి

విధి నిర్వహణలో మరణించిన నలుగురు పోలీసుల కుటుంబాలకు ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి ఈ నెల 16వ తేదీన ఆర్థిక సాయం నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన హెడ్‌కానిస్టేబుల్ సైదావలి సతీమణి హసీనాబీకి కార్పస్ ఫండ్ క్రింద లక్ష రూపాయలు, కానిస్టేబుల్ బి.ఆదిశేషయ్య సతీమణి బి.పెంచలమ్మకు వితంతు నిధి నుండి లక్ష రూపాయలు, ఏఆర్ కానిస్టేబుల్ ఎ.రవీంద్ర సతీమణి జి.రాజేశ్వరికి కార్పస్ ఫండ్ క్రింద 40వేలు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అలెగ్జాండర్ సతీమణికి 50వేల రూపాయల చెక్కులను ఏఎస్పీ అందజేశారు.

### మీడియా సెంటర్‌ను
## ప్రారంభించిన కలెక్టర్


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ఈ నెల 16వ తేదీన జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పౌరసంబంధాల శాఖ డి.డి వెంకటేశ్వరప్రసాద్, ఏపిఆర్ఓ రవి తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ పరేడ్

ఈ నెల 16వ తేదీన నెల్లూరు నగరంలో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల నేపథ్యంలో ప్రజలలో ధైర్యం కల్పించేందుకు ఎన్నికలకు ముందు ఇలాంటివి చేస్తుంటారు. నగర ప్రజలు కవాతును ఆసక్తిగా తిలకించారు.

## ఒంటిపూట బళ్ళు

18వ తేదీ నుండి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 12.15గంటల వరకు పరీక్ష జరుగుతుంది. నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను పరీక్షా కేంద్రాలుగా పెట్టడంతో మిగతా తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 6గంటల దాకా తరగతులు నిర్వహిస్తున్నారు.

## జూనియర్ కాలేజీలకు సెలవులు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు ఈ నెల 29వ తేదీ నుండి సెలవులు ప్రకటించారు. జూన్ 4వ తేదీన తిరిగి కాలేజీలను తెరుస్తారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి సత్యనారాయణ తెలిపారు.

### మద్యం ముద్దు అన్నోళ్లే...
## తాగొద్దంటున్నారు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కోసం నిన్నటి దాకా ఎక్సైజ్ శాఖ వాళ్ళు మద్యం అమ్మకాలను ప్రోత్సహించారు. మద్యం షాపులకు నెలకు ఇంత అమ్మాలని టార్గెట్ ఇచ్చారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో ఎక్సైజ్ శాఖ వాళ్ళే వినూత్న ప్రచారం మొదలుపెట్టారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే ఓటర్లు డబ్బు, మద్యంకు దూరంగా వుండాలని పిలుపునిస్తూ నెల్లూరురూరల్ ఎక్సైజ్ పోలీసులు వాల్‌పోస్టర్‌లు ముద్రించి బస్సులకు, గోడలకు అంటిస్తున్నారు. అక్రమ మద్యం నిల్వల వివరాల గురించి తెలిసినా తమకు తెలపాలంటూ ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చారు. మొన్నటిదాకా మద్యం అమ్మకాలను ప్రోత్సహించిన ఎక్సైజ్ వాళ్ళే ఎన్నికల వేళ నాలుగురూపాయలు సంపాదించుకునే టైంలో మా కడుపుకొడితే ఎలా అని మద్యం వ్యాపారులు వాపోతున్నారు.

## ఎన్నికల పరిశీలకులు వచ్చారు

ఏప్రిల్ నెలలో జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమ గెలుపు కోసం ఎన్నికల వ్యయాన్ని నిబంధనలకు మించి ఖర్చు చేయడం, పొదుపు చేయడం తదితర అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు తయారుచేసి భారత ఎన్నికల ప్రధానాధికారికి పంపే బాధ్యత వ్యయ పరిశీలకులది. ఇందులో భాగంగా భారత ఎన్నికల సంఘం నెల్లూరుజిల్లాకు కేటాయించిన ఎన్నికల వ్యయపరిశీలకులు శ్రీధర్, శివకుమార్ నెల్లూరువచ్చి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ముత్యాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. జేసి వెట్రి సెల్వి పాల్గొన్నారు.

## పందేలకు పండుగ



వరల్డ్ కప్ క్రికెట్, ఐపిఎల్ మ్యాచ్‌లు వంటివి జరుగుతుంటే పందేలరాయుళ్ళకు పండుగే! వీటికంటే కూడా ఎన్నికలప్పుడైతే మేడారం జాతరే! ఎందుకంటే పందేలకు ఎన్నో ఆప్షన్స్ వుంటాయి. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయి, ఏపిలో గెలిచేది ఏ పార్టీ? ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయి? ఎంపీ సీట్లు ఎన్నొస్తాయి? ఫలానా నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు?... ఇలా ఎన్నో రకాలుగా పందేలు పెట్టుకోవచ్చు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా కూడా ఎన్నికల వేడి వుంది. పందేలరాయుళ్ళు అప్పుడే రంగంలోకి దిగారు. నామినేషన్ల పర్వం ముగిసాక బెట్టింగ్‌లకు శ్రీకారం చుట్టే అవకాశముంది. ప్రతి ఎన్నికల్లోనూ ఒక్క నెల్లూరు జిల్లాలోనే కోట్లలో పందేలు జరుగుతాయి. ఈసారి కూడా బెట్టింగ్‌లు జోరుగానే వుండబోతున్నాయి.

### నెల్లూరుకు చేరిన
## మొదటి విడత కేంద్ర బలగాలు

ఎన్నికల బందోబస్తు కోసం 500మంది సిఐఆర్ఎఫ్ బృందం తొలివిడతగా నెల్లూరుకు చేరుకుంది. జిల్లాలో రెండు పోలీస్ సబ్‌డివిజన్‌లున్నాయి. ఒక్కో పోలీస్ సబ్‌డివిజన్‌కు వంద మంది లెక్కన ఎస్పీ ఐశ్వర్య రస్తోగి కేటాయించారు. త్వరలోనే మరికొన్ని బృందాలు నెల్లూరు రానున్నాయి.

### 25 నుండి భిక్షాటనా పూర్వక
## శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు



భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజస్మరణోత్సవ నభ వ్యవస్థాపకులు స్వర్గీయ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, స్వర్గీయ డాక్టర్ యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రి త్యాగరాజ కీర్తనలతో జోలెకట్టి భిక్షపట్టి సంగీత సేవకై అహర్నిశలు కృషి చేసిన మహానుభావులు. వారి సారథ్యంలో ప్రారంభమైన శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను వారి తదనంతరం వారి వారసులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ యనమండ్ర నాగదేవి ప్రసాద్ క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 25 నుండి 54వ శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి సంగీత విద్వాంసులు, కళాకారులను తీసుకువచ్చి గాత్ర, వీణ, వేణుగాన, వయొలిన్ తదితర కచేరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలు ప్రతిరోజు సాయంత్రం 4గంటల నుండి ప్రారంభమవుతాయి. స్థానిక కళాకారులు గాత్ర, వీణ, వయొలిన్, కీబోర్డు తదితర కచేరీలను నిర్వహిస్తారు. ఉదయం, మధ్యాహ్నం హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ సాయంత్రం 7.15 గంటల నుండి చెన్నై, హైదరాబాదు, అమెరికా నుండి వచ్చిన సంగీత విద్వాంసులచే గాత్ర, వేణుగాన కచేరీలను నిర్వహిస్తారు. వారంరోజుల పాటు జరిగే ఈ కార్య క్రమంలో సంగీతాభిమానులు, కళాకారులు, కళా పోషకులు, సాహితీవేత్తలు, కవులు పాల్గొని జయప్రదం చేయాలని భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ వారు కోరుతున్నారు.

# అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకు నివాళులు


పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు


నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని ఆర్యవైశ్యసంఘం నాయకులు అమరజీవికి ఘన నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్రం అవతరణ కోసం ఆత్మబలిదానం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములును స్మరించుకున్నారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి విగ్రహానికి పుష్పమాలలు వేసి నాయకులంతా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అర్బన్ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు, డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ అమరజీవి ప్రాణత్యాగం వల్లనే తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, ఆశయసాధనలో అసువులు బాసిన అమరజీవి త్యాగాలను ఏనాటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, వొమ్మిన మురళీకృష్ణ, అమరా వెంకటేశ్వర్లు, చలువాది శరణ్, దాసా సురేష్‌రాజా, తాతా కిషోర్, గంగిశెట్టి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ నివాళి..

అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగలా నిర్వహించింది. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పూలమాలలతో అలంకరించారు. జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, కార్పొరేషన్ కమిషనర్ అలీంబాషా తదితర అధికారులు పుష్పమాలలు వేసి అమరజీవికి నివాళులర్పించారు.

## 2014లో ఓడిన వాళ్ళే...

# వైకాపా అభ్యర్థులు

### గెలిచిన వాళ్ళకు టిక్కెట్లు లేవు









ఈసారి ఎన్నికల్లో నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ స్థానాల విషయంలో ఓ గమ్మత్తు చోటుచేసుకుంది. ఈ రెండు స్థానాల్లోనూ 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయిన వాళ్ళే 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులయ్యారు. 2014 ఎన్నికల్లో ఈ రెండు స్థానాల నుండి వైసిపి అభ్యర్థులుగా గెలిచిన వాళ్ళకు మాత్రం ఈ ఎన్నికల్లో సీట్లు లేకపోవడం గమనార్హం.

2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైసిపి అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి తలపడ్డారు. ఈ ఎన్నికల్లో ఆదాల, మేకపాటిల మధ్య గట్టిగానే పోరు నడిచింది. మేకపాటి 13వేల ఓట్లతో గెలిచాడు. 2019 ఎన్నికలకొచ్చేసరికి మేకపాటికి సీటు లేదు. 2014లో ఆయన చేతిలో ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపి ఎంపి అభ్యర్థి అయ్యాడు. ఒంగోలులోనూ సేమ్ సీన్. వైసిపి అభ్యర్థిగా వై.వి.సుబ్బారెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డిల మధ్య హోరా హోరీ పోరు నడిచింది. పదివేలకుపైగా మెజార్టీతో వై.వి.సుబ్బారెడ్డి గట్టెక్కాడు. 5ఏళ్ల తర్వాత సీన్ కట్ చేస్తే వై.వి.సుబ్బారెడ్డి చేతిలో ఓడిపోయిన మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు వైసిపి అభ్యర్థి, వై.వి.సుబ్బారెడ్డికి టిక్కెట్ కట్! ఏ నిముషానికి ఏమి జరుగునో అన్నది రాజకీయాలకు సరిగ్గా అతుకుతుంది.

## దేవకుమారుడే...

# కాంగ్రెస్ నాయకుడు!



డిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చేవూరును సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్... జిల్లాలో ఎందరో నాయకులకు రాజకీయ జన్మనిచ్చింది. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు... ఇలా ఎందరో పదవులు అనుభవించారు. ఆ పదవులు అనుభవించిన వాళ్ళంతా 2012 నుండి పార్టీకి క్రమక్రమంగా దూరం కాసాగారు. రాష్ట్ర విభజన అంశంతో ఈ రాష్ట్రంలో ఆ పార్టీ తనకుతానుగా ఆత్మహత్య చేసుకుందని చెప్పొచ్చు. ఇలా ఖాళీ అవుతూ వచ్చిన పార్టీలో నిన్నటి దాకా పనబాక దంపతులు పెద్దదిక్కుగా వుండే వాళ్ళు. పనబాక కృష్ణయ్య జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ వచ్చారు. మారిన పరిస్థితుల్లో పనబాక దంపతులు టిడిపిలో చేరడంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కొత్త నాయకుడు అవసరమయ్యాడు. ఈ నేపథ్యంలోనే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి దిక్కయ్యాడు. జిల్లా కాంగ్రెస్‌లో ఇంత వరకు పక్కపార్టీ వైపు చూడని రికార్డ్ చేవూరుది. సీనియర్ నేత సి.వి.శేషారెడ్డి కూడా ఒకసారి ప్రజారాజ్యంలోకి వెళ్ళి వచ్చినవాడే! చేవూరు మూడుసార్లు కోవూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశాడు. పార్టీ బాధ్యతలు తప్పితే, పార్టీ అధికారంలో వున్నప్పుడు ఇతర పదవులు అనుభవించని నాయకుడు. కాని, పార్టీ ద్వారా ప్రయోజనం పొందిన వాళ్లంతా కాంగ్రెస్‌ను వదిలిపోగా, ఒంట్లోని కాంగ్రెస్ రక్తాన్ని మార్చుకోలేక ఆయన ఆ పార్టీలోనే కొనసాగుతున్నాడు. తాజాగా డిసిసి అధ్యక్షుడుగా ఆయనే బాధ్యతలు తీసుకున్నాడు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# జంపింగ్ జపాంగ్స్



**రాజకీయాలన్నాక, రాజకీయ నాయకులన్నాక పార్టీలు మారడం, పార్టీ కండువాలను మార్చడం సహజం. పార్టీలు మారడమంటే చొక్కాలు మార్చినంత సులభం. ఒక్క నెల్లూరుజిల్లాలోనే తీసుకుంటే గడచిన ఐదేళ్ళ కాలంలో ఎందరో నాయకులు పార్టీలు మారారు. 2014 ఎన్నికల తర్వాత తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. దాంతో వైసిపి, కాంగ్రెస్, ఇతర పార్టీల నుండి ఆ పార్టీలోకి చాలా ఎక్కువుగా వలసలు జరిగాయి. అయితే ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో వైసిపిలోకి వలసలు ఎక్కువుగా వున్నాయి. ఆనాటి నుండి ఈనాటి వరకు వలసలు చూస్తే...**

- నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌తో వలసలకు శ్రీకారం చుట్టినట్లయ్యింది. ఆయన వైసిపి మేయర్‌గా గెలిచి నెలలు తిరక్కుండానే తెలుగుదేశంలో చేరాడు. ఆయనతో పాటు మరికొందరు కార్పొరేటర్లు కూడా తెలుగుదేశంలో చేరారు.
- ఆ తర్వాత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, జైసమైక్యాంధ్ర నాయకులు ఆనం జయ కుమార్‌రెడ్డి టీడీపీలో చేరారు.
- కావలిలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గ్రంధి యానాదిశెట్టి వైసిపిని వీడి టిడిపిలో చేరారు.
- ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలో చేరగా, వారి సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి వైసిపిలో చేరాడు. కాగా, ఆనం రామనారాయణరెడ్డి గత ఏడాది వైసిపిలో చేరడం తెలిసిందే!
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలో చేరారు. ఇటీవల వైసిపిలోకి మారారు.
- 2014 ఎన్నికల తర్వాత సన్నపరెడ్డి పెంచలరెడ్డి వైసిపి నుండి తెలుగుదేశంలో చేరాడు. ఇటీవలే మళ్లీ వైసిపిలోకి వచ్చాడు.
- గూడూరు వైసిపి ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్ కుమార్ తెలుగుదేశంలో చేరాడు. ఇప్పుడు గూడూరు అసెంబ్లీ నుండి ఆ పార్టీ అభ్యర్థిగానే పోటీ చేస్తున్నాడు.
- గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన దంపతులు తెలుగుదేశం నుండి వైసిపిలో చేరడం తెలిసిందే!
- కనుమూరు హరిచంద్రారెడ్డి, రవిచంద్రారెడ్డి సోదరులు వైసిపిలో చేరారు.
- గూడూరు మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ టిడిపిని వీడి వైసిపిలో చేరడం, తిరుపతి ఎంపి అభ్యర్థి కావడం చకచక జరిగిపోయింది.
- వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద, వెంకటగిరి మాజీఎమ్మెల్యేలు వెంకటగిరి రాజాలు తాజాగా టీడీపీని వీడి వైసిపిలో చేరిపోవడం చూశాం.
- నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి టిడిపిని వదిలి వైసిపిలో చేరడం తెలిసిందే!
- కావలి మాజీఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు వైసిపికి రాజీనామాలు చేసి తెలుగుదేశంలో చేరడం, కావలి తెలుగుదేశంకు కాటంరెడ్డి విష్ణు అభ్యర్థి కావడం చూస్తున్నాం.
- ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం ముఖ్య నాయకుడు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి ఇటీవలే వైసిపిలో చేరాడు!

### అటుకులు చిటుకులు మారండి

- జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైసిపిని వీడి తెలుగుదేశంలో చేరడం చూశాం.
- అన్నింటికంటే జిల్లా జనాలకు దిమ్మ తిరిగిపోయేలా జరిగిన జంపింగ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డిది. నెల్లూరురూరల్ టిడిపి అభ్యర్థిగా ప్రచారం మొదలు పెట్టిన ఆయన, వూహించని పరిణామాల మధ్య వైసిపిలో చేరి వైసిపి ఎంపి అభ్యర్థి అయ్యాడు.
- మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, మాజీ జడ్పీఛైర్మెన్ పి.చెంచలబాబుయాదవ్‌లు కాంగ్రెస్‌ను వదిలి టిడిపిలో చేరగా, పనబాక లక్ష్మి తిరుపతి లోక్‌సభ టిడిపి అభ్యర్థిగా బరిలో నిలవడం చూస్తున్నాం.



# ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న పనబాక కృష్ణయ్య, పక్కన పాశం సునీల్, పనబాక లక్ష్మి

పేదల కోసం అహర్నిశలు కష్టపడిన కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, గూడూరును అభివృద్ధి పథంలో నడిపిన ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పనబాక కృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని వనజాకృష్ణ కళ్యాణ మండపంలో మంగళవారం పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే సునీల్‌కుమార్, మాజీ జడ్పీచైర్మెన్ చెంచలబాబుయాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులకు కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరును అభివృద్ధి చేయలేదని అంటున్న వైకాపా నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి మంజూరు చేసిన నిధులతోనే పురఅధ్యక్షురాలు పంబలేరు వంతెనకు టెంకాయ కొట్టారని గుర్తు చేశారు. పనబాక లక్ష్మి మాట్లాడుతూ గూడూరులో కోట్లాది రూపాయలతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శీలం కిరణ్‌కుమార్, మనోజ్‌రెడ్డి, బషీర్, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంటేశ్వర్లురాజు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, చెంచురామయ్య, వీరిబోయిన రమాదేవి, మట్టం శ్రావణి, జానకి రామిరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి పోటీచేస్తున్న సర్వేపల్లి నియోజకవర్గంలోని అనికేపల్లి, కంటేపల్లి, తిక్కవరప్పాడు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో సోమిరెడ్డితో పాటు పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి సిరి శ్రీనివాసచౌదరి తదితరులు

# వైకాపాను ఆదరించండి - బల్లి దుర్గాప్రసాద్

ఈ ఎన్నికల్లో వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తిరుపతి ఎంపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. గూడూరులోని సిఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్, గూడూరు పురపాలకసంఘం అధ్యక్షురాలు పొణకా దేవసేనతో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తిరుపతి ఎంపి అభ్యర్థిగా తనను, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన వరప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్‌రావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కనుమూరు హరిచంద్రారెడ్డి, కొడవలూరు ధనుంజయ రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మెన్ కోడూరు కల్పలత, యారం మంజుల, యద్దల నరేంద్రరెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, బొమ్మి శ్రీనివాసులు, నాసిన నాగులు, గిరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బల్లి దుర్గాప్రసాద్



## గూడూరు డివిజన్ వార్తలు

# వైయస్సార్ అభిమానిగా పార్టీకోసం పనిచేస్తా! - మేరిగ మురళి



పార్టీని వ్యతిరేకించే తత్వం తనకు లేదని, వైయస్సార్ అభిమానిగా పార్టీకోసం పనిచేస్తానని గూడూరు నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త మేరిగ మురళి అన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. మేరిగ మురళి ఈ ఎన్నికల్లో వైయస్సార్సీపి టిక్కెట్‌ను ఆశించి పార్టీకి క్రమశిక్షణతో పనిచేశారు. అయినా గూడూరు వైకాపా టిక్కెట్ మాజీ ఎంపి వరప్రసాద్‌కు లభించడంతో మురళి మనస్తాపానికి గురయ్యారు. దీంతో ఆయన భవిష్యత్ రాజకీయ ప్రణాళిక ఏమిటనే విషయంపై రాజకీయవర్గాల్లో చర్చ జరిగింది. పలు ఊహాగానాల నేపథ్యంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, టిక్కెట్ రానంతమాత్రాన పార్టీని వ్యతిరేకించే తత్వం తనకు లేదన్నారు. అభ్యర్థి ఎవరైనాసరే, పార్టీ కోసం అంకితభావంతో కలసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేరిగ మురళితో పాటు సన్నిహిత నాయకులు కోడూరు మీరారెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు మునిగిరీష్ రాజీనామా



తాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వానికి, రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు కె.మునిగిరీష్ చెప్పారు. గూడూరులో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో చిరంజీవిపై అభిమానంతో ప్రజారాజ్యంలో చేరానని, ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో కాంగ్రెస్‌లో చేరానన్నారు. పనబాక దంపతులు కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేశానన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా



గూడూరులో ప్రచారం చేస్తున్న అరవ పార్వతయ్య

ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజల సమస్యల సాధన కోసం పోరాటం చేస్తానని స్వతంత్ర అభ్యర్థి అరవ పార్వతయ్య అన్నారు. గూడూరులోని అశోక్‌నగర్‌లో ఉన్న తాళ్ళమ్మ దేవస్థానంలో ఈనెల 19న ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమపథకాలు అందేలా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిజె అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, ధర్మరాజస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మెన్ వీరిబోయిన గోపాల్‌యాదవ్ ఈనెల 18న మునిసిపల్ చైర్మెన్ పొణకా దేవసేన, వైయస్సార్సీపి నాయకులు పొణకా శివకుమార్ రెడ్డి నివాసంలో వారి సమక్షంలో వైయస్సార్సీపిలో చేరారు.




# వైసిపి ఎన్నికల ప్రచారంలో స్టైల్ ఆఫ్ సింహపురి

శ్రీను గల్పిక 989

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. సంతపేటలోని మాజీ మంత్రి, వెంకటగిరి వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి నివాసం. రాత్రి 10గంటలైంది. వెంకటగిరిలో ప్రచారం ముగించుకుని అప్పుడే ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి చేరుకున్నాడు. స్నానం చేసి, కూడు తిని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి నడుం వాల్చాడు. ఎదురుగా గోడకు వేలాడదీసిన అన్న, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(68) సిగరెట్ తాగుతూ స్టైల్‌గా వున్న ఫోటోను చూశాడు. రామనారాయణరెడ్డి కళ్లల్లో ఒక్క క్షణం నీళ్ళు... అన్న లేకుండా మేం చేస్తున్న తొలి ఎలక్షన్ ఇది... ఆయనే వుండుంటే ఇంకెంత బాగుండో... ఆయన వుండుంటే జిల్లా రాజకీయాలు ఇంకా ఎంతో కళకళలాడుతుండేవనుకుంటూ అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

పక్కరోజు వెంకటగిరిలో జాతర మాదిరిగా వుంది. ఎక్కడ చూసినా వైసిపి జెండాలే... వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి ఆనం రామనారాయణరెడ్డి భారీ ర్యాలీతో తహశీల్దార్ ఆఫీసు వద్దకు వచ్చాడు. రిటర్నింగ్ అధికారి వద్దకొచ్చి నామినేషన్ పత్రాలు పూరించడం కోసం జేబులో చెయ్యి పెట్టాడు. పెన్ను లేదు, ఇదిగో తమ్ముడు ఈ పెన్‌తో ఫిలప్ చెయ్ అంటూ అప్పుడే ఓ చేయి ముందుకొచ్చింది. రామనారాయణకు ఆ పెన్ను ఎక్కడో చూసినట్టు అనిపించింది. ఆ పెన్ను అందిస్తున్న వ్యక్తి ఎవరా అని వెనక్కి చూశాడు. అంతే కళ్ళు తిరిగి క్రింద పడిపోయాడు. పక్కనున్న కార్యకర్తలు బిత్తరపోయారు. వెంటనే నీళ్ళు తెచ్చి రామనారాయణరెడ్డి ముఖాన చల్లారు. ఆయన మెల్లిగా కళ్ల తెరిచాడు. ఇంతకుముందు ఎవరినైతే చూసి అతను కళ్ల తిరిగి పడిపోయాడో ఆ వ్యక్తి అక్కడే వున్నాడు. అయితే ఈసారి రామనారాయణరెడ్డి కళ్ల తిరిగి పడిపోలేదు. ఆయన ముఖంలో ఆనందం, ఆశ్చర్యం.. వివేకన్నా... ఏందన్నా మీరిక్కడ... ఇది నిజమేనా? మీరేంటి మా ముందు ఇలా కనపడడమేంటి... ఇది కలకాదుగా అని తనను తాను గిల్లుకున్నాడు ఆనం రామనారాయణరెడ్డి. కళ్ళకు నల్లద్దాలు పెట్టి, జుట్టుకు గ్రే కలర్ కొట్టి, జీన్స్ ఫ్యాంట్‌పై పోలో టీషర్ట్ వేసి స్టైల్‌గా వున్న వివేకా తనదైన స్టైల్‌లో సిగరెట్ వెలిగించి... తమ్ముడు ఇది మన సెంటిమెంట్ పెన్, నువ్వు ఇంటి దగ్గర మరచిపోయి వచ్చావ్, దీంతో నామినేషన్ ఫారమ్ రాయి... గెలుపు గ్యారంటీ అని చెప్పాడు. అందుకు రామనారాయణ... గెలుపు సంగతి తర్వాత... ముందు ఇది చెప్పు... ఇక లేవు... కానరావు అనుకున్న మీరు ఇలా ఎలా వచ్చారో అర్థం కావడం లేదు. చరిత్రలో ఇదో అద్భుతం, ఎలా సాధ్యమైందని అడిగాడు. దానికి వివేకా... రాత్రి పడుకోబోయే ముందు నువ్వు నన్ను తలచుకుని కన్నీళ్లు పెట్టడం, నేను లేకుండా తొలిసారి నామినేషన్ వేస్తుండడంపై బాధపడడం పైనుండి చూసాను. ఎలాగైనా నీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనాలనిపించింది. దేవేంద్రుడికి ఈ విషయం చెప్పాను. ఆయన మొదట ఒప్పుకోలేదు... వెంటనే నేను దేవేంద్రుడికి వ్యతిరేకంగా ఒక గ్రూపును తయారుచేసి, ఆయనను గద్దెదించాలని, అక్కడ కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి అధిపతిని ఎన్నుకోవాలని ఉద్యమం మొదలుపెట్టాను. నా దెబ్బకు తట్టుకోలేక ఇంద్రుడు తన లోకం రాజ్యాంగాన్ని సవరించి స్పెషల్ పర్మిషన్ క్రింద ఎలక్షన్‌లు అయ్యేదాకా ఇక్కడే వుండమని చెప్పి పంపించాడు అని చెప్పాడు. దాంతో రామనారాయణ... ఈ పది రోజులు నువ్వు నా పక్కనుంటే... ప్రత్యర్థులతో చెడుగుడు ఆడుకుంటానన్నా... అని ఉత్సాహంగా చెప్పాడు. నామినేషన్ తర్వాత వివేకా నియోజకవర్గమంతా ప్రచారం చేశాడు. ఆ తర్వాత జిల్లాలో 9అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి ప్రచారం చేశాడు. అభ్యర్థులకంటే కూడా జనం వివేకాను చూడడానికి ఎగబడసాగారు. వివేకా ప్రచారం, అసలే బలంగా వున్న వైసిపిలో ఇంకా జోష్ పెంచింది. కావలిలో జగన్ బహిరంగ సభలోనూ వివేకా పాల్గొన్నాడు. విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పి.అనిల్ కుమార్ లాంటి వారితో వివేకా... స్టేజీ మీదే పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ముచ్చట్లు పెట్టుకున్నాడు. జగన్‌కు జనంలో ఎంత రెస్పాన్స్ వుందో వివేకాకు అంతకంటే ఎక్కువ రెస్పాన్స్ రాసాగింది. దీంతో జగన్... అన్నా, రాష్ట్రమంతా కూడా మీరు నాతో పాటు పర్యటించండని వివేకాను అడిగాడు. వివేకా దానికి... నాకు అంతకంటే అవకాశమా, మీకు ప్రచారం చేసి గతంలో నా వల్ల జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటా నన్నాడు.


తర్వాత అన్ని నియోజకవర్గాలలో జగన్‌తో పాటు వివేకా కూడా పాల్గొని చంద్రబాబును తనదైన శైలిలో ధుమ్మెత్తిపోయసాగాడు. రాష్ట్ర వ్యాప్తంగా వివేకా ప్రభావంతో వైసిపికి ఇమేజ్ పెరగగా తెలుగుదేశం డామేజ్ కాసాగింది.

★★★★★

ఢిల్లీలోని ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం. ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా ఛాంబర్‌లో హైటెక్‌రత్న చంద్రబాబు, నారా లోకేష్, మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కళా వెంకట్రావ్, దేవినేని ఉమ ఇంకా కొందరు తెలుగుదేశం నాయకులు న్నారు. మీ కంప్లైంట్ ఏంటి అని సునీల్ అరోరా అడిగాడు. చంద్రబాబు ఆవేశంగా, ఉండండి... బాధ అనిపించదాండి.. రక్తం పొంగిపోతుంది... వీళ్ల సంగతి తేలుస్తా అంటూ అరవసాగాడు. సునీల్ అరోరా జోక్యం చేసుకుని ఇది అసెంబ్లీ కాదు, చెప్పాల్సిన విషయం నేరుగా చెప్పండని కోరాడు. చంద్రబాబు దానికి... సార్, ఎక్కడైనా ఈ భూమ్మీద వున్న మనుషులు ఎవరి పార్టీకి వాళ్ళు ప్రచారం చేయడం చూసాం. కాని చచ్చిపోయి స్వర్గానికి పోయినోళ్లు కూడా వచ్చి మా రాష్ట్రంలో వైసిపి తరపున ప్రచారం చేస్తున్నారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనే కదా... అయినా ఆ దేవేంద్రుడికైనా ఆలోచన లేదా... ఇది ముమ్మాటికీ నరేంద్రమోడీ పనే... ఈ నరేంద్రమోడీతో ఆ దేవేంద్రుడు కుమ్మక్కై ఇలా వివేకాను పంపించాడు. రామనారాయణరెడ్డి ఫోటో చూస్తూ తన అన్నను తలచుకునేసరికి పక్కరోజు వివేకా వచ్చాడంట... ఈరోజు జగన్మోహన్‌రెడ్డి పడుకోబోయే ముందు తన తండ్రి ఫోటోను చూస్తూ తలచుకుంటే రేపు వై.యస్. రాజశేఖరరెడ్డి వస్తే మా పరిస్థితేంటి... కాబట్టి వెంటనే వివేకాను ఆయన లోకానికి పంపించే ఏర్పాట్లు చేయండి... ఇలా చనిపోయిన వాళ్లందరూ తిరిగొచ్చి ప్రచారం చేస్తుంటే మా పరిస్థితేం కావాలి అని ఆవేశంగా చెప్పాడు. అంతలో లోకేష్ హఠాత్తుగా 'డాడీ' అంటూ గట్టిగా అరిచాడు. చంద్రబాబు అదిరిపడి... ఏమైందిరా అని అడిగాడు. నాకు సూపర్ ఐడియా వచ్చిందని లోకేష్ చెప్పాడు. ఏంటో చెప్పు అని బాబు అడిగాడు. దానికి లోకేష్... ఈ రాత్రి మీరు నిద్రపోయే ముందు తాత నందమూరి తారకరామారావు ఫోటోను చూస్తూ ఆయనను తలచుకుని నిద్రపోండి... రేపు ఉదయం తాతయ్య వస్తాడు... ప్రచారంలో ప్రభంజనం సృష్టిస్తాడు అని చెప్పాడు. ఆ మాట వినగానే చంద్రబాబు టక్కున అక్కడే టేబుల్‌పై వున్న ఫైళ్ళను తీసుకుని లోకేష్ తలపై వాయిస్తూ... అసలే డూప్లికేట్ ఎన్టీఆర్ వుండే 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాకే భయపడి చస్తుంటే, నువ్వు ఒరిజినల్ ఎన్టీఆర్‌నే తీసుకొచ్చే ప్లాన్ చేస్తావా... ఆయన వచ్చి నిజాలు చెప్పాడంటే మన బ్రతుకు మంగళగిరి మాన్యమే... అని కొట్టసాగాడు.

ఆ సీన్ కళ్లపై కదలాడుతుండ దంతో... హా హా హా అంటూ ఆనం రామనారాయణరెడ్డి నిద్రలోనే నవ్వసాగాడు. అప్పుడే తెల్లారడంతో తన బాస్‌ను లేపడానికి అక్కడికొచ్చిన పి.ఏ అష్రాఫ్... తన బాస్ నిద్రలోనే నవ్వడాన్ని చూసి ముఖంపై నీళ్ళు చల్లాడు. చల్లగా నీళ్ళు పడడంతో రామనారాయణరెడ్డి ఉలిక్కిపడి లేచాడు. చుట్టూ చూసాడు. అప్పటిదాకా జరిగింది కల అని తెలుసుకోవడానికి ఆయనకు అరగంట పట్టింది. రాత్రి పడుకునే ముందు అన్న వివేకాను తలచుకున్నానో లేదో... ఇట్టే కలలోకి వచ్చి ఆశీర్వదించాడని సంబరపడుతూ ప్రచారానికి పోవడానికి లేచాడు.

# ఇటు పరీక్షలు... అటు ఎన్నికలు



## ప్రచార హోరులో నలిగిపోతున్న విద్యార్థులు

నెల్లూరుజిల్లాలో పదవ తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యాయి. ఇదే సందర్భంలో ఎన్నికల హడావిడి కూడా మొదలయ్యింది. నిద్ర లేచింది మొదలు రాత్రి 10 గంటల వరకు ప్రచార ధ్వనులు హోరెత్తిస్తుండడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం, ఇబ్బందిగా మారింది. దీంతో విద్యార్థులకు ఏకాగ్రత దెబ్బతింటోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రణగొణ ధ్వనులతో ఇబ్బంది పడే సమయంలో తల్లిదండ్రులు ఆయా ప్రచార వాహనాల్లో ఉండే వ్యక్తులను నానా తిట్లు తిడుతున్నారు. కొంతమందైతే నేరుగా విమర్శలు చేస్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పోటీ చేసే అభ్యర్థులు, వారి కార్యకర్తలు శబ్దాలను తగ్గించుకుంటే విద్యార్థులకు మేలు చేసినవారవుతారు.

పరీక్షల టైంలో ఒకవైపు ప్రచారాల శబ్దాలతో పాటు వ్యాపారస్తులు చేసే శబ్దాలు విద్యార్థులను చికాకు పెడుతున్నాయి. ఉదయం లేచింది మొదలు ఆటోల్లో, ద్విచక్రవాహనాల్లో ఎర్రగడ్డలమ్మ... ఎర్రగడ్డలు అని పాత పేపర్లు కొంటాం అంటూ మరొకరు, గ్యాస్‌స్టౌలు రిపేరు చేస్తాం, పరుపులు కుడతాం అంటూ ఇంకొకరు... ఇవన్నీ కలిసి ప్రశాంత వాతావరణంలో చదువుకునే విద్యార్థుల ఏకాగ్రతకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగిస్తున్న మైకుల నుంచి వెలువడే శబ్దాలతో విద్యార్థులతో పాటు వృద్ధులు, రోగులు, మానసిక ఆందోళన, ఒత్తిడికి గురౌతున్నారు.

అంతేకాకుండా పెళ్లిళ్ళు, ఫంక్షన్లు జరిగే కళ్యాణ మండపాల్లో వినిపించే హడావిడి, హోరు అంతా ఇంతా కాదు. ఒకప్పుడు కళ్యాణ మండపాల్లో మేళ తాళాలు మాత్రమే ఉండేవి, ఇప్పుడు మ్యూజిక్ ఆర్కెస్ట్రాలు, తీన్‌మార్ శబ్దాలతో హోరెత్తిస్తున్నారు. రకరకాల బ్యాండుమేళాలతో వీధుల్లో మోగే మోత, బాణాసంచాల పేలుళ్ళు విద్యార్థుల చదువులకు భంగం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం అన్నిచోట్లా మైకుల హోరు భయపెడుతోంది. ఆటోలు, లారీలు, బస్సులు, మోటారుబైక్‌ల వింత వింత శబ్దాలతో హారన్ల మోత భరించలేని విధంగా మారింది.

### పరీక్షల సమయంలో ఇలా చేస్తే మేలు

ఇళ్ళ మధ్యలో మైకుల ప్రచారాన్ని కట్టడి చేసి శబ్ద పరిమితిని అమలు చేయాలి. పగలు శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలి. పాఠశాలలకు సమీపంలో ఎలాంటి ధ్వనులు లేకుండా చూడాలి. ఆసుపత్రులు, కళాశాలలు, జంతు ప్రదర్శనశాలలు తదితర ప్రాంతాల్లో చట్టాలను కఠినంగా అమలు చేయాలి. వేడుకల సమయంలో వెలువడే శబ్దాలపై చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ సక్రమంగా అమలు చేస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా చదువుకుని పరీక్షలు రాసి బాగా ఉత్తీర్ణులయ్యే అవకాశం వుంది.

# ధర్మం లేనిచోట సుఖం ఉండదు

**ఆధ్యాత్మిక ప్రవచకులు కృష్ణమూర్తి**

'ధర్మం లేని చోట సుఖం ఉండదు. అదేవిధంగా, ఎవరికైనా కీడు కలిగించాలని కోరుకునేవారి జీవితంలోనూ ఎన్నడూ ప్రశాంతత అనేదే ఉండదు. ధర్మబద్ధంగా ఉంటూ, సమాజ శ్రేయస్సును కోరుకునేవారి జీవితమే ఎప్పుడూ సుఖశాంతులతో వర్ధిల్లుతుంది''..అన్నారు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త కోట కృష్ణమూర్తి. నెల్లూరులోని ఫతేఖాన్‌పేట శ్రీరామ మందిరంలో ఈనెల16న 'మహాభారతంలోని విరాటపర్వం' గురించి ఆయన ఉపన్యసించారు. మహాభారతానికి శ్వాస వంటిది విరాటపర్వమని అంటూ ఆ పర్వంలోని కీచకవధ, ఉత్తర గోగ్రహణం వంటి ఘట్టాలను వాటి విశిష్టతలను వివరించారు. నెల్లూరుకు చెందిన మహాకవి తిక్కన మధురమైన తెలుగు పద్యాలతో భారతాన్ని ఆంధ్రీకరించారని, ఇది నెల్లూరుసీమకే గర్వకారణమని అన్నారు. అనంతరం ఆలయ కమిటీవారు కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉండకూడదు

**అధికారులకు జోన్ సి.ఇ నరసింహులు ఆదేశం**

విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలుగకూడదని, లోఓల్టేజీ వంటి సమస్యలేమైనా తమ దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఏపిఎస్పీడిసిఎల్ తిరుపతి జోన్ సి.ఇ నరసింహులు పేర్కొన్నారు. ఈ నెల 16న ఆయన నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో నెల్లూరు రూరల్‌కు చెందిన విద్యుత్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా సర్కిల్‌లో విద్యుత్ అంతరాయాలు కలుగకుండా అదనంగా 150 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నామని, అన్నిరకాల కొత్త విద్యుత్ సర్వీసులను వెంటనే మంజూరుచేసి మార్చి నెలాఖరునాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం, విద్యుత్‌లైన్లు సరిగా లేకపోవడం వంటి సమస్యలను గుర్తించి, అవసరమైతే వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా సర్కిల్ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి, రూరల్ డిఇ జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!

అభిమిత్ర - లలిత



హైదరాబాద్ వాస్తవ్యులు నెల్లూరు మధుసూదనరావు - లేట్ వాణిల కుమారుడు అభిమిత్ర - లలిత (పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాస్తవ్యులు అన్నాబత్తుల రామకృష్ణ - వీరహేమ కుముదల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 13వ తేదీ భీమవరంలోని జెఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

# రూరల్‌లో వేగం పెంచిన మనుక్రాంత్



రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అభ్యర్థుల లిస్టు ప్రకటించకముందే నెల్లూరుజిల్లా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో తానే అభ్యర్థిగా ప్రజల ముందుకు ప్రచారానికి వెళ్లిన నాయుకుడు జనసేన అభ్యర్థి మనుక్రాంత్ చెన్నారెడ్డి. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఆటోల ద్వారా జనసేన అభ్యర్థిగా గ్లాసు గుర్తుకు ఓటేయాలంటూ నియోజకవర్గంలోని ప్రతిప్రాంతంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాడు. ఇటీవల నెల్లూరులో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటన విజయవంతంలోనూ కీలకపాత్ర పోషించాడు. నెల్లూరురూరల్ జనసేన అభ్యర్థిగా అధికారికంగా ఖరారైన తర్వాత జనసైనికులను కలుపుకుని విస్తృతంగా తిరుగుతూ పార్టీ కార్యకర్తల్లో, పవన్ అభిమానుల్లో ఉత్సాహం నింపుతున్నాడు. ప్రవాసభారతీయుడైన మనుక్రాంత్ కేవలం తన జన్మభూమికి సేవలందించాలనే లక్ష్యంతోనే అక్కడ ఉద్యోగాన్ని వదులుకుని తనకిష్టమైన పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో రాజకీయంగా ముందుకు నడుస్తున్నాడు.

# కన్నులపండువగా... శ్రీ రంగనాధస్వామి బ్రహ్మోత్సవాలు

## భక్తజన సందోహం మధ్య.. వేడుకగా వాహనసేవలు



మోహినీ అవతారంలో రంగనాథుని ఊరేగింపు

నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న ప్రసిద్ధమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాధస్వామివారి ఆలయంలో ఈనెల 16నుంచి అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 16న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈనెల 26వ తేది వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల21వ తేది ఉదయం 8గంటలకు మోహినీ అవతారం, రాత్రి 8 గంటలకు కనువిందుగా స్వామివారికి బంగారు గరుడసేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఆలయ సంప్రదాయాల్లో భాగంగా తొలుత ఉదయం 10 గంటలకు అహోబిలమఠం వారు శ్రీ రంగనాధస్వామి ఆలయానికి గౌరవవస్త్రాలు తీసుకువచ్చి స్వామివార్లకు బహూకరించారు. అనంతరం రంగనాధస్వామివారి దేవస్థానం తరపున ఆ మఠం వారికి ఆలయ నిర్వాహకులు స్వామివారి శేషవస్త్రం బహూకరించి ఘనంగా సత్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22వ తేది సాయంత్రం 4 గంటలకు స్వామివారికి-అమ్మవార్లకు శోభాయమానంగా పూలంగిసేవ జరిగింది. అనంతరం కల్యాణోత్సవం, గజవాహనసేవ వైభవంగా జరిగాయి. ఈనెల 23వతేది ఉదయం 8.30గంటలకు వైభవోపేతంగా శ్రీరంగనాధ స్వామివారి రథోత్సవం జరుగుతుంది. అనంతరం రాత్రి 7గంటలకు పొన్నవాహనోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పుష్పాలంకారం నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వేమూరి గోపి, ధర్మకర్తల మండలి సభ్యులు కనసాని ఆదినారాయణ, దువ్వూరు నరేంద్ర, శ్రీకంఠం రమణయ్య, పొంగూరు వెంకటసుబ్బారెడ్డి, శ్రీమతి మానికల సుష్మాదీప్తి, పిగిలం సుధీర్‌కుమార్, పసుపులేటి మల్లికార్జునరావు, చుండూరు జగన్మోహన్, కిడాంబి జగన్నాధాచార్యులు (ఎక్స్‌అఫిషియో సభ్యులు) తదితరులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

# పెద్దాయన త్యాగం... వైసిపికి మహాబలం



మేకపాటి రాజమోహన్‌రెడ్డి... మాజీఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు... 1983 నుండి రాజకీయాలలో వున్న నాయకుడు. రాజకీయాలలో 36ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం. ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడి సమకాలికుడు. ఈ 36ఏళ్ళ చరిత్రలో ఆయన పోటీలో లేకుండా నడుస్తున్న నాలుగో ఎన్నికలివి. 1983లో ఉదయగిరి అసెంబ్లీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి బీజేపీ అభ్యర్థి వెంకయ్యనాయుడు చేతిలో ఓడిపోయాడు. 1985లో అదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచాడు. 1989లో ఒంగోలు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచాడు. 1991లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఆయనకు బ్రేక్ పడింది. అప్పుడు సీఎంగా వున్న స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మేకపాటికి చెక్ పెట్టేందుకు మాగుంట సుబ్బరామరెడ్డిని ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా దించారు. కాంగ్రెస్ టిక్కెట్ రాకపోవడంతో మేకపాటికి ఆ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండాపోయింది. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఆయన ఉదయగిరి కాంగ్రెస్ టిక్కెట్ ఆశించారు. అది కూడా అప్పుడు సిటింగ్ ఎమ్మెల్యేగా వుండిన మాదాల జానకిరామ్‌కే ఇచ్చారు.

తర్వాత కాలంలో ఆయన తెలుగుదేశంలో చేరారు. 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలుగుదేశం నుండి ఒంగోలు లోక్‌సభకు పోటీ చేసి మాగుంట పార్వతమ్మ చేతిలోనూ, 1998 ఎన్నికల్లో ఇక్కడి నుండే మాగుంట శ్రీనివాసులురెడ్డి చేతిలోనూ పరాజయం పొందారు. 1999 ఎన్నికల నాటికి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాడు. 2004లలో నరసారావుపేట లోక్‌సభ నుండి గెలిచాడు. 2009లో నెల్లూరు పార్లమెంట్ నుండి విజయ సాధించారు. వై.యస్. మరణానంతరం జగన్ వైసిపిని స్థాపించాక ఆ పార్టీలో చేరాడు. జగన్ ఆదేశాలతో ఆయన ఎంపి పదవికి రాజీనామా చేయడంతో 2012లో నెల్లూరు లోక్‌సభకు ఉపఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆయన వైసిపి అభ్యర్థిగా దాదాపు 3లక్షల మెజార్టీతో విజయం సాధించాడు. 2014లోనూ తిరిగి ఇదే పార్లమెంట్ నుండి వైసిపి అభ్యర్థిగా గెలిచాడు. ఆయన రాజకీయ ప్రయాణం మొదలు పెట్టాక ఆయన పోటీలో లేకుండా రాష్ట్రంలో నాలుగోసారి జరుగుతున్న ఎన్నికలివి. జగన్ రాజీనామా చేయమంటే... ఆయన కోసం రెండుసార్లు ఎంపి పదవికి తృణప్రాయంగా రాజీనామా చేశాడు. ప్రత్యేకహోదా ఉద్యమంలో ఢిల్లీలో ప్రముఖపాత్ర వహించాడు. జాతీయ వేదికలపై తెలుగువాణిని బలంగా వినిపించాడు. ఈరోజు పార్టీ మరింత బలం పుంజుకోవడం కోసం తన సీటునే త్యాగం చేశాడు. కొత్త శక్తులకు అవకాశం కల్పించి అసలైన వై.యస్. భక్తుడు, వైసిపి సైనికుడు అని నిరూపించుకున్నాడు.

# విజయం కోసం సోమిరెడ్డి చండీయాగం



గొలగమూడిలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 20న చండీయాగాన్ని నిర్వహించారు. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం లోని గంగపట్నం చాముండేశ్వరి ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో దాదాపు మూడుగంటల పాటు చండీయాగాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయంలో సోమిరెడ్డి, ఆయన సతీమణి జ్యోతిరెడ్డి, కుటుంబసభ్యులతో కలిసి గోపూజ చేశారు. అలాగే, వెంకటాచలం మండలంలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని సందర్శించుకుని ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు.

# శ్రీసిటీలో జపాన్ డైకి సంస్థ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శ్రీసిటి ఎండి రవి సన్నారెడ్డి, కంపెనీ ప్రతినిధులు

నెల్లూరుజిల్లా తడ మండలం శ్రీసిటిలో ఈ నెల 20న జపాన్‌కు చెందిన డైకి అల్యూమినియం మిశ్రమ లోహ పరిశ్రమకు శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి భూమిపూజ నిర్వహించారు. డైకి సంస్థ అధ్యక్షుడు టకాకి యమామెటో, చైనాకు చెందిన డెల్టా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఛైర్మెన్ జావోరాంగ్ భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటిలో ఈ ఏడాది ఇప్పటివరకు రెండు జపాన్ పరిశ్రమలు నిర్మాణాలు ప్రారంభించాయని తెలిపారు. అల్యూమినియాన్ని పునర్వినియోగం చేసే కంపెనీలలో ప్రఖ్యాతి చెందిన డైకి సంస్థ మన దేశంలో పరిశ్రమలు నెలకొల్పడం శుభపరిణామమన్నారు. 20 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఈ పరిశ్రమ 2020 ఫిబ్రవరికి ప్రారంభం అవుతుందన్నారు. ఏడాదికి 84వేల టన్నుల పాత అల్యూమినియం వస్తువులను కరిగించి అల్యూమినియం కడ్డీలు తయారు చేస్తారని, ఈ ఉత్పత్తులు దేశీయ ఆటోమొబైల్ కంపెనీలతో పాటు ఆసియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతుందని కంపెనీ నిర్వాహకులు తెలిపారు. దాదాపు 600 మందికి ఉపాధి కలుగుతుందని, అందులో 80శాతం మహిళలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

# చీలుద్దాం... గెలుద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

కానీ, దేశ రాజకీయాలలోనే ఈ సాధారణ శైలికి భిన్నంగా పోయే నాయకుడు చంద్రబాబునాయుడు. ఆయన తన పరిపాలనకంటే కూడా పరిస్థితులను ఎక్కువుగా నమ్ముతాడు. ప్రత్యర్థుల బలహీనతలకు గురిపెడతాడు. పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ వాతావరణం ఎలా వుందో చూసుకుంటాడు. ట్రెంకు తగ్గట్లు ఎవరిని పట్టాలో పట్టుకుంటాడు.

## పొత్తులతోనే గెలిచాడు...

తన పరిపాలనా రెఫరెండంతో చంద్రబాబు ఒక్కసారి కూడా అధికారంలోకి రాలేదు. 1995లో ఆయన సీఎం అయ్యిందే ఎన్టీఆర్‌ను దించేసి. 1999లో వాజ్‌పేయి సానుభూతి వుందని తెలిసి బీజేపీతో పొత్తుతో గెలిచాడు. 2004, 2009లలో ఓడిపోయాడు. 2009లో వై.యస్.రాజశేఖరరెడ్డి తన పరిపాలననే రెఫరెండంగా చేసుకున్నాడు. ప్రజలు అనుకూలంగా తీర్పిచ్చారు. 2014లో చంద్రబాబు రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో విభజిత ఆంధ్రాలోనే 13జిల్లాల్లో పరిస్థితులను అంచనా వేశాడు. మోడీ గాలి వుందని తెలుసుకున్నాడు. బీజేపీ వాళ్ళు ఒప్పుకోకపోయినా పైరవీలు చేయించి బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. పవన్ వస్తే కాపుల ఓట్లు కొల్లగొట్టొచ్చనుకున్నాడు. ఆయన ఇంటికి వెళ్లి మద్దతు అడిగాడు. మోడీ ఇమేజ్, పవన్ మద్దతు, ఆనాటి జగన్ వ్యక్తిగత పొరపాట్లు... వెరసి 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది.

## అడ్డదారుల్లోనే...

చంద్రబాబు ఐదేళ్ళు ముఖ్యమంత్రిగా పరిపాలించాడు. ఈ ఐదేళ్ళ కాలంలో చేసిన అభివృద్ధి పనులు, సాగించిన పరిపాలనపై నమ్మకముంటే ఆయన తన గెలుపు కోసం వాటినే నమ్ముకోవాలి. వాటినే ప్రచారం చేసుకోవాలి. కాని, ఆయన వాటిని ఎక్కువుగా నమ్ముకోలేదు. రహదారి కంటే అడ్డదారులనే వెదుక్కొంటున్నాడు. ఈ ఎన్నికల్లో మళ్ళీ గెలవడం కోసం మూడెంచెల వ్యూహం అమలు చేస్తున్నాడు. ప్రభుత్వ వ్యతిరేక, జగన్ అనుకూల ఓట్లను చీలుద్దాం, గెలుద్దాం అనే యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టాడు. పవన్ కళ్యాణ్‌తోకలిసి పోటీ చేస్తే ఈసారి కాపులు ఓట్లేయరని తెలుసుకున్నాడు. అందుకే కాపుల ఓట్లు వైసిపికి పోకుండా చీలగొట్టడం కోసం బి-టీమ్‌గా జనసేనను రంగంలోకి దించాడు. సిబిఐ మాజీ జె.డి లక్ష్మీనారాయణ తెలుగుదేశంలోకి వస్తానంటే, జగన్ కేసుల వ్యవహారంలో తమ లాలూచీ ఎక్కడ బయటపడుతుందోనని భావించిన చంద్రబాబు, ఆయనను టిడిపిలోకి కాకుండా జనసేనలో చేర్చాడు. ఇక రహస్య ఒప్పందంలో ప్రధాన అంశం పవన్, జె.డిలు పోటీ చేసే స్థానాలలో టిడిపి బలహీన అభ్యర్థులను పెట్టడం. తన పార్టీ కార్యాలయమున్న మంగళగిరిలో జనసేన పోటీ చేయకుండా లోకేష్ కోసం సిపిఐకు ఆ సీటివ్వడం. ఇదంతా బాబు, పవన్‌ల మధ్య రహస్య అవగాహనే! అలాగే పొత్తులో భాగంగా బిఎస్పీ, వామపక్షాలకు సీట్లన్నీ కూడా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో కేటాయించారు. పవన్ ప్రభావం వుంటుందనుకున్న గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాత్రం జనసేన పోటీ చేస్తుంది. ఇదంతా బాబు డైరెక్షన్‌లో జరుగుతున్నదే అనే సంగతి వేరే చెప్పనక్కరలేదు. దక్షిణాది పార్టీల మీద ఉత్తరాది పార్టీల పెత్తనమేంటి అంటూ ఈమధ్యంతా పవన్‌కళ్యాణ్ పలు సభలలో ప్రశ్నించాడు. మరి అలాంటప్పుడు రాష్ట్రంలో అసలు లేని ఉత్తరప్రదేశ్ పార్టీ బిఎస్పీని ఏపికి పిలిచి మరీ ఎందుకు పొత్తు పెట్టుకున్నట్లు? ఎందుకు సీట్లిచ్చినట్లు? కాపుల ఓట్లు చీల్చడానికి జనసేన... దళితుల ఓట్లు చీల్చడానికి బిఎస్పీ!

అలాగే రెండో ప్లాన్ కాంగ్రెస్ ద్వారా అమలు చేయడం. తెలంగాణ ఎన్నికల్లో చంద్రబాబు ఆ పార్టీతో కలిసే వెళ్లాడు. ఆంధ్రాలో కలిసి పోటీ చేస్తే జనం వ్యతిరేకిస్తారని ఆ పార్టీ చేత విడిగా పోటీ చేయిస్తున్నాడు. వైసిపికి బలమైన ఓటు బ్యాంకుగా వున్న రెడ్లు, మైనార్టీల ఓట్లు చీల్చే దిశగా ఆయా నియోజకవర్గాలలో ఈ సామాజికవర్గాలకు చెందిన వారినే అభ్యర్థులుగా దించారు.

## పచ్చమీడియాలో రొచ్చువార్తలు...

చంద్రబాబు గెలుపు కోసం అన్నింటికంటే ఇంకా ఎక్కువ ఆధారపడింది పచ్చమీడియా! ఇది ఇంకో వ్యూహం. జగన్ మీద వ్యతిరేక కథనాలను వ్రాయించడం, ప్రసారాలు చేయించడం, వాటిని ప్రజలు నమ్మేటట్లు చేయడం... చంద్రబాబు అనుకూల పత్రికలు, ఛానెల్స్ ఈ బాధ్యతలను ఇప్పటికే భుజాలకెత్తుకుని, తమ నైతికతను కూడా వదులుకుని బాగానే పని చేస్తున్నాయి. చేసిన పరిపాలన ద్వారా కాకుండా పక్కదారుల గుండా తిరిగి అధికారాన్ని దక్కించుకోవాలన్నది చంద్రబాబు వ్యూహం. మరి ఈ ఎన్నికల్లో చంద్రబాబు వ్యూహాలు ఫలించి 2014ను తలపిస్తాయో, లేక ఆయన పరిపాలనకు విరక్తి చెంది ప్రజలు తీర్పు ఇచ్చిన 2004 నాటి ఫలితాలను ప్రతిబింబిస్తాయో చూడాలి!?

# ఎన్నికల నిర్వహణకు రెడీ!..



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రేవు ముత్యాలరాజు చెప్పారు. ఈనెల 17న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్‌ల ప్రక్రియకు సంబంధించి వివరాలు వెల్లడించారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితోపాటు అయిదుగురికి అనుమతి ఉంటుందని, అఫిడవిట్‌ను కూడా తీసుకుంటామన్నారు. ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రెండు డిజిటల్ గడియారాలతో పాటు గేటు వద్ద వీడియో కెమెరా, ఛాంబర్ లోపల 360డిగ్రీల కోణాల్లో చిత్రీకరించేలా నాలుగు కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 25వేల రూపాయలు, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 10వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్వతంత్ర అభ్యర్థికి సంబంధించి చెక్‌లిస్ట్ ద్వారా ప్రతిపాదనలు అందించవచ్చన్నారు. ఈనెల 25వ తేది వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, 26న స్క్రూటిని, 28న విత్‌డ్రాయల్స్ ముగిసిన తర్వాత తుదిజాబితాను ప్రకటిస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియ 11వ తేది ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొన్నారు.

# 'దేశం'లో కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి కావడం ఒక కలలా జరిగిపోయింది. ఆదాల చాలా సింపుల్‌గా టిడిపిలో నుండి వైసిపిలోకి వెళ్లిపోయాడు. తాను పార్టీ మారడానికి ప్రధాన కారణం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డేనంటూ ఆయననో పాపాలభైరవుడి మాదిరిగా వర్ణించాడు. పార్టీలో తనకు చాలా అవమానాలు జరిగాయని, సోమిరెడ్డి తనను పార్టీ నుండి వెళ్లగొట్టడానికే కంకణం కట్టుకున్నాడంటూ తాను పార్టీ వీడడానికి ఆదాల కారణాలు వివరించాడు. ఆయన పోవడంవరకు సరే... ఆయన ఇచ్చిన షాక్‌కు జిల్లాలో తెలుగుదేశం భారీ కుదుపులకు లోనైంది. ఆదాల పోటీతో నెల్లూరురూరల్‌లో హోరాహోరీ పోటీ వుంటుందనుకున్నారు. ఆయన వైసిపిలోకి పోవడంతో నెల్లూరురూరల్‌లో వార్ వన్‌సైడ్ అయినట్లయ్యింది. తెలుగుదేశం వాళ్ళు నెల్లూరురూరల్‌కు అప్పటికప్పుడు కొత్త అభ్యర్థి అన్వేషణ సాగించి చివరకు మేయర్ అజీజ్‌ను నిలబెట్టారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి పక్కకు తప్పుకోవడం ఆదాల పార్లమెంట్ అభ్యర్థి కావడంతో ఒక్కసారిగా జిల్లా వైకాపాలో తెలియని వూపొచ్చింది. నెల్లూరురూరల్‌లో వైసిపికి గట్టి పోటీ లేకుండా పోయింది. నెల్లూరు సిటీలోనూ జోష్ వచ్చింది. కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గాల్లో వైసిపి అంతకుముందుకంటే ఇంకా పుంజుకుంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపి అభ్యర్థి అయ్యుంటే ఆయనపై వున్న వ్యతిరేకత ఎమ్మెల్యే అభ్యర్థులపై కూడా కొంతవరకు ప్రభావం చూపుండేది. అభ్యర్థిగా మేకపాటి వుంటే లోక్‌సభ పరిధిలోని నాలుగైదు నియోజకవర్గాల్లో పోటీ నువ్వా-నేనా అన్నట్లు మారుండేది. ఆదాల కావడంతో లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ వైసిపి అనూహ్యంగా వేగం పెంచింది. ఆదాల కొట్టిన దెబ్బకు జిల్లాలో టిడిపికి పెద్ద నష్టమే జరుగుతుందని అంచనా!

# సౌమ్యుడిని చంపిన కిరాతకులెవరు?

(మొదటి పేజీ తరువాయి)

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సోదరుడు, జగన్ చిన్నాన్న, మాజీమంత్రి వై.యస్.వివేకానందరెడ్డి దారుణహత్య. వై.యస్. కుటుంబసభ్యులే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అభిమానులను నివ్వెరపరిచే విషాదవార్త.

వైయస్సార్ జిల్లా పులివెందులలోని తన ఇంట్లో వై.యస్. వివేకానందరెడ్డి హత్యకు గురికావడం జరిగింది. ఈ నెల 15వ తేదీ ఉదయం ఆయన హత్య వార్త వెలుగులోకి వచ్చింది. ఆయన బాత్‌రూమ్‌లో పడిపోయి వుండడాన్ని చూసి మొదట గుండెపోటు వచ్చి చనిపోయినట్లుగా భావించారు. రక్తపు మడుగులో వున్నా గుండెపోటుకు గురైనప్పుడు బాత్‌రూంలో ట్యాప్ పై తల పడి వుంటుందని, రక్తం కారి వుంటుందని అనుకున్నారు. అయితే మృతదేహంపై తర్వాత బలమైన గాయాలు కనిపించడంతో హత్యగా అనుమానించి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రావడం పోస్ట్‌మార్టమ్‌లో ఆయనది హత్యేనని తేలడంతో ఈ హత్య ఒక మిస్టరీగా మారిపోయింది.

చంద్రబాబు పాలనలో వై.యస్. కుటుంబంలో జరిగిన రెండో హత్య ఇది. గతంలో చంద్రబాబు సీఎంగా వున్నప్పుడే వై.యస్. రాజారెడ్డిని దారుణంగా హత్య చేశారు. వై.యస్. సీఎం అయ్యాక తన తండ్రి హంతకులపై ప్రతీకారానికి పోకుండా న్యాయస్థానాలనే నమ్మాడు. ఇక దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ దుర్ఘటన వెనుక ఎవరి హస్తం వుందన్నది ఇంకా తేలలేదు.

ఇప్పుడు చంద్రబాబు హయాంలోనే వై.యస్.వివేకానందరెడ్డి హత్యకు గురయ్యాడు. ఆయన హత్యపై దర్యాప్తును ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. సిట్ బృందం వివేకా హత్యను ఆర్థిక వివాదాల కోణంలో చూస్తూ కొందరిని విచారిస్తోంది. జగన్ మాత్రం చంద్రబాబు హయాంలో ఈ హత్య వెనుక నిజాలు బయటకు రావంటూ, దీనిపై థర్డ్ పార్టీ విచారణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు.

చంద్రబాబు మాత్రం దీనిని కూడా రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నాడు. ఈ హత్యను వై.యస్. కుటుంబానికి అంటగట్టాలని ప్రయత్నిస్తున్నాడు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో జగన్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు చంద్రబాబు వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలకే వెగటు కలిగించింది. సీఎం అన్న హోదా మరచి ప్రెస్‌మీట్ పెట్టి మరీ వెకిలిగా వ్యవహరించారాయన. ఇప్పుడు వై.యస్.వివేకానందరెడ్డి హత్య విషయంలోనూ ఆయన అంతే చౌకబారుగా వ్యవహరించాడు. ముఖ్యమంత్రి స్థాయిలో కాకుండా ఒక ఎస్.ఐ లెవల్లో ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడిన తీరు కూడా వెగటు కలిగించేలా వుంది.

వై.యస్.వివేకానందరెడ్డి సౌమ్యుడు, వివాదరహితుడు. ఫ్యాక్షనిస్టు కాదు. ఎవరికీ ఆయనను చంపాల్సిన అవసరం లేదు. రాజకీయ అండదండలు, బలమైన సహకారం లేనిదే ఆయనను హత్య చేసేంత ధైర్యం చేయలేరు. వివేకానందరెడ్డి హత్యపై రాజకీయ ప్రమేయం పనిచేయని సంస్థలతో దర్యాప్తు చేయిస్తే కాని నిజాలు బయటకు రావు.


శ్రీరస్తు! శుభమస్తు!!
శ్రీ రంగనాథ పరబ్రహ్మణే నమః శ్రీమతే రామానుజాయ నమః
శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానము
రంగనాయకులపేట, నెల్లూరు. ఫోన్ : 0861 - 2331156 / ఇ.ఓ: 94942 89008.
బ్రహ్మోత్సవ ఆహ్వానము
తేది. 16-03-2019 నుండి తేది. 26-03-2019 వరకు



22-03-2019 శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కల్యాణోత్సవం
23-03-2019 శనివారం ఉదయం 8.30 గంటలకు రథోత్సవం
24-03-2019 ఆదివారం రాత్రి 7 గంటలకు అశ్వవాహనము
25-03-2019 సోమవారం సాయంత్రం 6 గంటలకు పుణ్యకోటి విమానము
26-03-2019 మంగళవారం రాత్రి 7గంటలకు దవనోత్సవము, ధ్వజావరోహణము
27-03-2019 బుధవారం రాత్రి 7గంటలకు తెప్పోత్సవము
ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమములు కలవు.
భవదీయులు
శ్రీ కోట గురుబ్రహ్మం, ఛైర్మెన్
వేమూరి గోపి, కార్యనిర్వహణాధికారి
ధర్మకర్తల మండలి:
శ్రీ కనసాని ఆదినారాయణ, శ్రీ దువ్వూరు నరేంద్ర, శ్రీ శ్రీకంఠం రమణయ్య,
శ్రీ పొంగూరు వెంకటసుబ్బారెడ్డి, శ్రీమతి మానికల సుష్మాదీప్తి, శ్రీ పిగిలం సుధీర్‌కుమార్,
శ్రీ పసుపులేటి మల్లికార్జునరావు, శ్రీ చుండూరు జగన్మోహన్, శ్రీ కిడాంబి జగన్నాధాచార్యులు, ఎక్స్‌అఫిషియో మెంబర్

అధినేతల పర్యటనలు

# 'దేశం'లో నిస్తేజం.. వైసిపిలో ఉత్తేజం



సభలో నెల్లూరు రూరల్, లోక్‌సభ అభ్యర్థులుగా అజీజ్, బీదలను ప్రకటిస్తున్న చంద్రబాబునాయుడు

జిల్లాలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పోటీలో పలు పార్టీలున్నా ప్రధాన పోటీ తెలుగుదేశం, వైసిపిల మధ్యే నెలకొనివుంది. ఎన్నికల సమరంలో దిగి పోరాడుతున్న తమ అభ్యర్థులకు మరింత ధైర్యం కల్పించేందుకు పార్టీ అధినేతలు ప్రచార పర్యటనలు జరుపుతున్నారు. ఈ క్రమంలో భాగంగానే ఈనెల 18వతేదీన నెల్లూరులోని ఎస్‌విజిఎస్ కాలేజీ మైదానంలో జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సభలో ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సభ ఏర్పాటుకు రెండురోజుల ముందే జరిగిన పరిణామాలతో జిల్లా తెలుగుదేశం పార్టీలో నిస్తేజం ఆవరించింది. అనూహ్యంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపిలో చేరడంతో తెలుగుదేశం శ్రేణులు డీలాపడ్డాయి. చంద్రబాబు వచ్చి అద్భుతాలేమన్నా సృష్టిస్తాడనుకుంటే అదీ లేదు. ఆయన వచ్చి సభలో మాగుంట శ్రీనివాసులురెడ్డిని, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని తిట్టాడు. ఇక తన సహజధోరణిలో జనానికి విసుగొచ్చేలా పాత స్టోరీలే చెప్పాడు. సభకు జనాల్ని తీసుకురావడమే కష్టమైతే, వచ్చిన వారిచేత చప్పట్లు కొట్టించడం ఇంకా కష్టమైంది. ఇక సభలో నెల్లూరు, తిరుపతి పార్లమెంటు అభ్యర్థులతో పాటు జిల్లాలోనే పది అసెంబ్లీల అభ్యర్థులను గెలిపించాలంటూ చంద్రబాబు కార్యకర్తలను కోరారు.

వైసిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 20వ తేదీన కావలిలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఎలాంటి షామియానాలు, కుర్చీలు వేయలేదు. కూలర్లు పెట్టలేదు. నడిరోడ్డు మీద నడి ఎండలో పెట్టిన సభకు జనం పోటెత్తినట్లు వచ్చారు. ఈ సభలో జగన్ ఐదేళ్ళ తెలుగుదేశం ప్రభుత్వ అవినీతి పాలనను తూర్పారబట్టారు. చంద్రబాబు, కరువు కవలపిల్లలు అంటూ చలోక్తులు విసిరారు. రాష్ట్రంలో ఒక మాఫియా సామ్రాజ్యాన్ని స్థాపించాడంటూ చంద్రబాబుపై దుమ్మెత్తిపోశాడు. వైసిపి అధికారంలోకి వస్తే చేయబోయే పనులను వివరించాడు. జగన్ ప్రసంగానికి వచ్చిన అశేషజనం చప్పట్లతో, కేరింతలతో హుషారుగా స్పందించారు.



రైతులు అందించిన నాగలితో అభివాదం చేస్తున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి



చంద్రబాబు సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు



కావలి బహిరంగ సభలో పాల్గొన్న అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వై.యస్.జగన్




జననం: 05.08.1957

మరణం: 18.03.2019

## ఉత్తరక్రియలు

మానవతా విలువల మణిహారం
ఎందరి జీవితాలకో వెలుగునిచ్చిన ఆశాదీపం
మంచితనానికి నిలువుటద్దం

**శ్రీ అల్లారెడ్డి విజయకుమార్‌రెడ్డి గారు**

(S/o లేట్ అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి)

తే.18.03.2019ది సోమవారం స్వర్గస్థులైనారు.

*వారి ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...*

భార్య:
**అల్లారెడ్డి నీనారెడ్డి**
JMD

తమ్ముడు:
**అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి**
MD

**సవేరా హోటల్**, చెన్నై

**ఉత్తరక్రియలు**

తే.27.03.2019ది బుధవారం ఉదయం 9గంటలకు నెం.9, రివర్‌వ్యూ రోడ్, కొట్టూరుపురం, చెన్నై- 600 085లోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com